www.hamsakalam.com

సంచలన తెలుగు దినపత్రిక

PRGI: TGTEL/26/A3129

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA

చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

TELANGANA RISING CURE - PURE - RARE



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:42 SUNDAY ,JUNE 21,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 42 ఆదివారం 21 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-

## 27 లక్షల మంది విద్యార్థులకు విజయ పాలు అందిస్తాం: భట్టి విక్రమార్క



హంసకలం వార్త జూన్ 20

పాడి రైతుకు భరోసా కల్పిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విజయ డెయిరీకి ప్రభుత్వ అండగా ఉంటుందని మాటిచ్చారు. 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు అందించేందుకు కసరత్తు చేస్తున్నామని వివరించారు. శనివారం సచివాలయంలో పాల సేకరణ, వినియోగంపై భట్టివిక్రమార్క ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. -మిగతా2లో

# నీట్ అభ్యర్థులు ఒత్తిడికి లోను కాకుండా పరీక్ష రాయాలి

హంసకలం వార్త జూన్ 20

నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి ముఖ్యమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతోకాలంగా కృషి చేశారని పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదల పై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. -మిగతా2లో



## వీబీజీ రామ్‌జీ చట్టం పై కేంద్రానికి మంత్రి సీతక్క లేఖ

హంసకలం వార్త జూన్ 20


వీబీజీ రామ్‌జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి నిరసన లేఖ రాశామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. నూతన చట్టాన్ని ఉపసంహరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. నూతన చట్టంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ మూడు వేర్వేరు లేఖలు కేంద్రానికి పంపించామని వెల్లడించారు. -మిగతా2లో



## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజున ఒడిశాలో భారీగా అభివృద్ధి ప్రాజెక్టులు

హంసకలం వార్త జూన్ 20

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి -మిగతా2లో



## పోక్సో కేసు.. బండి సంజయ్ కొడుకు భగీరథ్‌కు బెయిల్





పోక్సో కేసులో నెల రోజులుగా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్
షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన మల్కాజ్‌గిరి కోర్టు
రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారిన భగీరథ్ వ్యవహారం

## కొత్త ఓటరు నమోదు పై అబద్ధాలు నమ్మకండి: తెలంగాణ 'సర్' ప్రక్రియ పై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి

హంసకలం వార్త జూన్ 20

తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. -మిగతా2లో



## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మా పై దుష్ప్రచారం ఆపండి




- హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ రంగనాథ్ ఆగ్రహం
-హైడ్రాను బద్నాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- సిటీలో ఇప్పటి వరకు 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని వెల్లడి

## నిరాహార దీక్ష చేస్తా: కాంగ్రెస్ ప్రభుత్వానికి కవిత వార్నింగ్

- సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లాలోని గనిని సందర్శించిన కవిత
- మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న 1200 మంది వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్




## యోగా ఒక మతానికి పరిమితం కాదు.. అలా చూడటం మూర్ఖత్వం: వెంకయ్య నాయుడు

హంసకలం వార్త జూన్ 20

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా భారీ యోగా ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు... యోగా విశిష్టత పై అత్యంత స్పష్టమైన, కీలకమైన వ్యాఖ్యలు చేశారు. - మిగతా2లో



హంస కలం వార్త HAMSA KALAM VARTA
ఆదివారం 21 జూన్ 2026

## పోక్సో కేసు.. బండి సంజయ్ కొడుకు భగీరథ్‌కు బెయిల్

తెలంగాణలో గత నెల రోజులుగా హాట్ టాపిక్‌గా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భగీరథ్‌కు ఎట్టకేలకు మల్కాజ్‌గిరి కోర్టులో ఊరట లభించింది. దాదాపు నెల రోజులుగా చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అతనికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఒక మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో భగీరథ్‌పై కఠినమైన పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి కొడుకు కావడం, పైగా సున్నితమైన కేసు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులు అజ్ఞాతంలోకి వెళ్లిన భగీరథ్.. మే 17న పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యాడు. ఆ తర్వాత మేడ్చల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు. బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురవడంతో నెల రోజులకు పైగా జైల్లోనే గడపాల్సి వచ్చింది. తాజాగా ఇంజినీరింగ్ పరీక్షల నేపథ్యంలో, భగీరథ్ కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మా పై దుష్ప్రచారం ఆపండి

హైదరాబాద్ లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు. హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని, ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్యనగరంలో చాలా ఉన్నాయి. చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం" అని స్పష్టం చేశారు. గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. "లక్ష మంది ప్రజలకు మంచి చేయాలన్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు" అని తేల్చి చెప్పారు

## యోగా ఒక మతానికి పరిమితం కాదు.. అలా చూడటం మూర్ఖత్వం: వెంకయ్య నాయుడు

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా భారీ యోగా ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు... యోగా విశిష్టతపై అత్యంత స్పష్టమైన, కీలకమైన వ్యాఖ్యలు చేశారు. యోగాను ఒక మత కోణంలో చూసే వారిపై ఆయన తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. యోగా అనేది ఏ ఒక్క మతానికో, వర్గానికో పరిమితమైంది కాదని... దానికి మతాన్ని ఆపాదించి చూడటం ముమ్మాటికీ మూర్ఖత్వమే అవుతుందని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. "ప్రపంచానికి భారతదేశం అందించిన అత్యంత గొప్ప అమూల్యమైన కానుక యోగా. ఇది కేవలం వ్యాయామం కాదు.. మనిషిని సమగ్ర మనిషిగా మార్చే అద్భుత సాధనం. మానవ చైతన్యానికి, సర్వమానవ సౌభ్రాతృత్వానికి ఇదొక నిదర్శనం. మానసిక ఒత్తిడిని దూరం చేసి, గుండె నిబ్బరాన్ని, ఆధ్యాత్మిక స్థైర్యాన్ని ఇచ్చే ఈ జీవన విధానాన్ని మన పూర్వీకులు మనకు అందించారు. ప్రకృతి ఒడిలో జీవిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటను ప్రతి ఒక్కరూ నిజం చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... విశ్వవ్యాప్తంగా యోగాకు వస్తున్న గుర్తింపు మన దేశానికి గర్వకారణమన్నారు. యోగా అనేది మన ప్రాచీన సంస్కృతిలో ఒక భాగమని, నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికీ శారీరక, ఆరోగ్య చింతన ఎంతో అవసరమని పేర్కొన్నారు.బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... ప్రధాని మోదీ చొరవతోనే 12 సంవత్సరాల క్రితం యోగాకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించిందని, నేడు ప్రపంచ దేశాలన్నీ యోగాను అనుసరిస్తున్నాయని గుర్తు చేశారు. డిప్రెషన్ లాంటి సమస్యలను దూరం చేయడానికి యోగా అద్భుతంగా పనిచేస్తుందని, పిల్లల నుండి పెద్దల వరకు అందరూ దీనిని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.

# నీట్ అభ్యర్థులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్ష రాయాలి

దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలని తెలిపారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

**తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి జయశంకర్ ప్రేరణ: సీఎం రేవంత్‌రెడ్డి**

తెలంగాణ జాతిపిత జయశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళి అర్పించారు. ప్రత్యేక తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కీర్తించారు. తెలంగాణ రాష్ట్ర సాధనే జయశంకర్ ఉచ్ఛ్వాస నిశ్వాసలని కొనియాడారు. జయశంకర్ త్యాగాలను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరవదని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయ సాధనకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రలో విలీనం చేయడాన్ని జయశంకర్ వ్యతిరేకించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విలీనంతో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించిన మహనీయుడు అని కీర్తించారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా ఉంచిన ఘనత జయశంకర్‌దేనని చెప్పారు. తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి జయశంకర్ మార్గదర్శి అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి జయశంకర్ కృషి చిరస్మరణీయమని ప్రశంసించారు. మహనీయుడి ఆశయాల సాధనలో తమ ప్రభుత్వం ముందుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# 27 లక్షల మంది విద్యార్థులకు విజయ పాలు అందిస్తాం: భట్టి విక్రమార్క

రాష్ట్రంలో పాల ఉత్పత్తిపై సమగ్ర నివేదిక కోరారు. ఈ సందర్భంగా మీడియాతో భట్టివిక్రమార్క మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు విజయ డెయిరీ పాలు అందజేస్తామని చెప్పుకొచ్చారు. పాడి రైతులకు బకాయిలు లేకుండా చెల్లింపులు చేస్తామని తెలిపారు. రైతులకు సమయానికి బిల్లులు చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పాడి పరిశ్రమే వెన్నెముక..**

పాలిచ్చే పశువుల అసలు సంఖ్య గుర్తించాలని అధికారులకు మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పాడి పరిశ్రమే వెన్నెముక అని వ్యాఖ్యానించారు. రైతులకు అదనపు ఆదాయ వనరుగా పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతోందని తెలిపారు. పాల ధరలపై స్పష్టమైన విధానం అవసరమని అన్నారు. సంక్షేమ శాఖల నుంచే నేరుగా బిల్లుల చెల్లింపులు చేయాలని ఆదేశించారు. రైతులకు బకాయిలు లేకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని చెప్పారు. తెలంగాణలో పాల ఉత్పత్తి పెంపునకు ఆధునిక విధానాలు పాటిస్తామని వెల్లడించారు. పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఈ చర్యలు చేపడతామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజున ఒడిశాలో భారీగా అభివృద్ధి ప్రాజెక్టులు

ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం.

**పహాడ్‌పూర్‌ను 'సోలార్ విలేజ్'గా ప్రకటన**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు.

**పారిశ్రామిక ప్రగతి, 'ఉత్కర్ష్ ఒడిశా'**

ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు.

**సంస్కృతి, సంప్రదాయాలకు గౌరవం**

అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్వ' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# వీబీజీ రామ్‌జీ చట్టం పై కేంద్రానికి మంత్రి సీతక్క లేఖ

శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను యథాతథంగా కొనసాగించి గ్రామీణ పేదల ఉపాధి హక్కును కేంద్రం కాపాడాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల అధికారాలను బలహీనపరిచే నిబంధనలని వెంటనే సవరించాలని విజ్ఞప్తి చేశారు. వీబీజీ రామ్‌జీ నిధుల కేటాయింపు విధానం పేదలు, దళితులు, గిరిజనులకు అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు.

**పనిదినాల ఆధారంగానే నిధుల కేటాయింపు జరగాలి..**

రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా చూడకుండా గ్రామస్థాయి ఉపాధి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. ఆదిలాబాద్, ములుగు, కుమురంభీం, ఆసిఫాబాద్ వంటి వెనుకబడ్డ ప్రాంతాల అవసరాలు విస్మరించొద్దని అన్నారు. గ్రామ పంచాయతీల్లో నమోదైన వాస్తవ పనిదినాల ఆధారంగానే నిధుల కేటాయింపు జరగాలని సూచించారు. నిధుల పంపిణీ విషయంలో కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పుకొచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వీబీజీ రామ్‌జీ పరిధిలో అనుమతించాలని కోరారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు గతంలోలాగే 90 రోజుల ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత భూ అభివృద్ధి పనులను తొలగిస్తే చిన్న రైతులకు నష్టమని చెప్పారు.

**జీవనోపాధి పనులను కొనసాగించాలి..**

ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులకు ఉపయోగపడే జీవనోపాధి పనులను కొనసాగించాలని మంత్రి సీతక్క సూచించారు. వరదలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ, న్యూట్రి గార్డెన్లు, వెదురు తోటలకు అనుమతి ఇవ్వాలని కోరారు. 60 రోజుల తప్పనిసరి ఉపాధి విరామం గ్రామీణ పేదల ఆదాయాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాలు, నీటి ఎద్దడి ప్రాంతాలకు 60 రోజుల నిషేధం నుంచి మినహాయింపు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ పనులకు ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మొక్కల పెంపకం, అటవీకరణ కార్యక్రమాలకు ఉపాధి విరామం వర్తింపజేయొద్దని అన్నారు. దళితులు, గిరిజనులు, భూమిలేని కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చట్టంలో మార్పులు చేయాలని మంత్రి సీతక్క సూచించారు.

## కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి: తెలంగాణ 'సర్' ప్రక్రియ పై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి

తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పై ఈరోజు హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల జూన్ 25 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వయంగా రానున్నారు. వారు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి జూలై 25 లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఎవరైనా కొత్తగా ఓటు హక్కు పొందాలనుకుంటే అదే ఫారంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు ఇప్పటికే మ్యాపింగ్ వేగంగా సాగుతోంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతం మ్యాపింగ్ పనులు పూర్తయ్యాయి. 2002 నాటి ఓటరు డేటాతో అనుసంధానమైన వారికి కొత్తగా ఎలాంటి ఇతర డాక్యుమెంట్లు అవసరం లేదు. వలస వచ్చిన వారు లేదా కొత్త ఓటర్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక పత్రాలను అనుమతిస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మొత్తం డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అన్ని ప్రక్రియలు ముగించుకుని అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని తెలిపారు.

## నిరాహార దీక్ష చేస్తా: కాంగ్రెస్ ప్రభుత్వానికి కవిత వార్నింగ్

సింగరేణి 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే-5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న దాదాపు 1200 మంది వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఒక నెల రోజులు టైమ్ ఇస్తున్నామని, ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకపోతే జులై 20 నుంచి తాను నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరించారు. సింగరేణిలో ఏ చిన్న పని జరగాలన్నా నేరుగా డిప్యూటీ సీఎం ఆఫీస్ నుంచే లంచాలు అడుగుతున్నారంటూ కవిత సంచలన ఆరోపణ చేశారు. కాంగ్రెస్ పాలనలో లాభాల్లో ఉన్న సింగరేణిని నష్టాల్లోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. మొన్న జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడికి తీవ్ర గాయాలవడానికి యాజమాన్యం వాడుతున్న నాసిరకం డిటోనేటర్లే కారణమన్నారు. గనుల లోపల పని చేసే కార్మికులకు కనీసం స్వచ్ఛమైన గాలి, మంచి నీరు కూడా ఇవ్వకుండా అధికారులు కక్కుర్తి పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిటైర్ అయిన కార్మికులకు సొంత ఇంటి కల నెరవేర్చడం కోసం సింగరేణికి ప్రత్యేకంగా 'హౌసింగ్ బోర్డు' ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం లేదా కార్మిక సంఘం తరఫున రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. అలాగే విజిలెన్స్ ఎంక్వయిరీల పేరుతో కార్మికులను భయభ్రాంతులకు గురిచేయవద్దని అన్నారు. ఉద్యమ కాలం నుంచే తాను సింగరేణి కార్మికులతో కలిసి నడిచానని గుర్తుచేసిన కవిత... తెలంగాణ హక్కుల కోసం తాను స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని భూపాలపల్లి ప్రజలు, బొగ్గుగని కార్మికులు గుండెల్లో పెట్టుకుని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

# సంపాదకీయం


## ప్రజాపాలనలో 'శ్రామిక విజయగీతిక'


రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్.అంబేద్కర్ ఆకాంక్షించిన శ్రమ గౌరవం, కార్మిక సంక్షేమం లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాల్సిన అవసరాన్ని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గుర్తించింది. ఈ నేపథ్యంలోనే స్వరాష్ట్రంలో కార్మిక--కర్షక వర్గానికి తగిన న్యాయాన్ని చేకూర్చడానికి 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కనీస వేతనాల పెంపును మేనిఫెస్టోలో చేర్చి, వారికి మేమున్నామంటూ భరోసానిచ్చింది. కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కాలని పరితపించింది. కార్మికుడు సంతృప్తిగా ఉంటేనే ఉత్పాదకత పెరుగుతుందనీ, ఉత్పాదకత పెరిగితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుందనీ, అందుకే వేతనాల పెంపు అనేది ఖర్చు కాదు, అది మానవ వనరులపై పెట్టుబడి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కనీస వేతనాల పెంపుపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధిని చాటుకున్నారు. ఈ మధ్యే మంత్రివర్గ ఉపసంఘం చేసిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన ప్రజా ప్రభుత్వం.. పెరుగుతున్న జీవన వ్యయాలు, కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, ఆరోగ్య భద్రత వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని శ్రామికుల సంక్షేమమే లక్ష్యంగా కార్మికుల వేతనాలను భారీగా పెంచుతూ మే 21న చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. 13వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కానుకగా 1 జూన్, 2026 నుంచి పెంచిన వేతనాలు అమల్లోకి వచ్చాయి. రాష్ట్రంలోని 1.11 కోట్లకు పైగా కార్మికులకు ఈ పెంపుతో లబ్ధి చేకూరుతున్నది. తెలంగాణ ప్రజా ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేస్తూ కనీస వేతనాల వ్యవస్థలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. కనీస వేతనాల పరిధిలో కొత్తగా మరో 10 ఉపాధి రంగాలను చేర్చడంతో రాష్ట్రంలో ఈ చట్టం వర్తించే రంగాల సంఖ్య 77కు చేరుకుంది. దీంతో మరింత మంది కార్మికులు చట్టబద్ధమైన వేతన రక్షణ పరిధిలోకి వచ్చి, లబ్ధి పొందనున్నారు. ఇప్పటివరకు వివిధ రంగాలకు వేర్వేరు కనీస వేతనాలు అమలులో ఉండగా, తెలంగాణ ప్రభుత్వం అందరికీ సమాన న్యాయం జరిగేలా ఏకీకృత కనీస వేతనాల నమూనాను ప్రవేశపెట్టింది. ఈ నిర్ణయం ద్వారా వేతన వ్యవస్థలో పారదర్శకత పెరగడంతో పాటు కార్మికులకు న్యాయమైన పారితోషికం అందే అవకాశం మరింత బలపడింది. ప్రాంతాల అభివృద్ధి స్థాయి, జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించారు. నగరపాలికలను జోన్--1గా, మున్సిపాలిటీలను జోన్--2గా, గ్రామాలు--ఇతర ప్రాంతాలను జోన్--3గా గుర్తించి నైపుణ్య స్థాయిల ఆధారంగా కనీస వేతనాలను ప్రజాప్రభుత్వం ఖరారు చేసింది. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ కేటగిరీల వారీగా వేతనాలను పెంచడం ద్వారా కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడంతో పాటు వారిలో నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు కార్యాచరణను ప్రభుత్వం అమలు చేస్తున్నది. అంతేకాకుండా, వేతన సవరణ ప్రకారం.. రోజుకు 8 గంటలకు మించి పనిచేస్తే అదనపు పని గంటలకు ఓవర్‌టైమ్ వేతనం, వారాంతపు సెలవులు, ప్రభుత్వ సెలవు దినాల్లో పనిచేసే కార్మికులకు ఆ రోజు సాధారణ వేతనానికి రెండింతల వేతనం చెల్లించాల్సి ఉంటుంది. దీంతో కార్మికుల శ్రమకు తగిన గౌరవం, ప్రతిఫలం లభిస్తుంది. గుత్తేదారులు లేదా సర్వీస్ ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్న కార్మికుల విషయంలో కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపింది. కనీస వేతనాల అమలు బాధ్యతను ప్రధాన యజమానిపైనే ఉంచడం ద్వారా మధ్యవర్తుల కారణంగా కార్మికులు నష్టపోకుండా రక్షణ కల్పించింది. ఈ మధ్యే గవర్నర్ ఆమోదించిన గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం... కార్మిక సంక్షేమంపై ప్రజాప్రభుత్వానికున్న నిబద్ధతను చాటుతున్నది. కర్ణాటక, రాజస్థాన్, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల తర్వాత దేశంలోనే ఈ చట్టాన్ని అమలుచేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలవడం మనందరికీ గర్వకారణం.

## ఆమె... ఎగసిపడే కెరటం కాదు!

ఇటీవలి వరకూ నారా భువనేశ్వరి ఓ సాధారణ గృహిణి. కుటుంబం ఆలనాపాలనా చూసుకుంటూ, వారితో తప్ప మిగతావారితో పెద్దగా మాట్లాడేవారు కూడా కాదు. రాజకీయాల్లో ఆమెకు అ, ఆ లు కూడా తెలియవు, ఏనాడూ రాజకీయాల్లోకి తొంగిచూసిందీ లేదు. కానీ, మూడేళ్ల క్రితం అనూహ్యమైన పరిస్థితుల మధ్య ఆమె ఒక కొత్త పాత్రలోకి ప్రవేశించాల్సి వచ్చింది. సెప్టెంబర్ 9, 2023న చంద్రబాబు నాయుడును వైసీపీ ప్రభుత్వం అరెస్టు చేయడం రాష్ట్రాన్ని, దేశాన్ని కల్లోలంలో పడేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ అంటూ ఆయనపై బురదజల్లి జైలుకు తరలించిన ఆ పరిస్థితుల్లో ప్రజలను చైతన్యపరచడం, తెలుగుదేశం కేడర్‌కు అండగా నిలవడం భువనేశ్వరి కర్తవ్యాలు అయ్యాయి. పేదల శోక వదనాలు ఆమెను కంటతడి పెట్టించాయి. ఎదురైన కష్టం ఆమెను కార్యోన్ముఖురాలిగా మార్చింది. 'న్యాయాన్ని గెలిపించండి' అంటూ రాష్ట్రమంతటా పర్యటించాలని ఆమె నిర్ణయించుకున్నారు, చైతన్య యాత్రకు శ్రీకారం చుట్టారు. భువనేశ్వరి చదువు అంతా ఆంగ్లంలో సాగింది కనుక ఆమెకు తెలుగులో ఉపన్యసించడం రాదు. కానీ కాలం, అవసరం ఆమెకు మంచి తెలుగు నేర్పింది. ఆమె అపర కాళిలా మారలేదు కానీ మహా చైతన్యమూర్తిగా మారింది. ఆమె మనసు అలలకు ఎగసిపడే కెరటం కాదు! నిండు కుండలా తొణకని వ్యక్తిత్వం భువనేశ్వరిది. ప్రజల్ని రెచ్చగొట్టి అరాచకం, అల్లర్లు సృష్టించడం ఆమె అభిమతం కాదు. తన భర్తకు జరిగిన అన్యాయాన్ని ఆమె రాష్ట్ర ప్రజలకు విపులంగా వివరించారు, వారిలో ఆలోచనలను రేకెత్తించారు. ఆమె వేదనంతా ఓట్ల రూపంలో కూడా మారింది. ఆరుపదుల వయస్సు దాటినా భువనేశ్వరి నిరంతరం శ్రమిస్తూ హెరిటేజ్ ఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కీలకపాత్ర పోషిస్తున్నారు. సిబ్బందితో మమేకమవుతూ, సమష్టి నిర్ణయాలు తీసుకుంటూ సంస్థను విస్తృతపరుస్తున్నారు. ఇప్పుడు ఆమె పూర్తిగా మారిన మనిషి. మునుపటిలా రిజర్వ్‌డ్‌గా ఉండడం లేదు. డెయిరీతో పాటు ఆమె ఎన్టీఆర్ ట్రస్ట్ సేవల్ని విస్తృతంగా చేపట్టి బృహత్తర ఆశయంతో ముందుకు వెడుతున్నారు. కార్పొరేట్ రంగంలో సామాజిక బాధ్యతగా ఆమె ట్రస్ట్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, చేస్తున్న కృషి అంతా ఇంతా కాదు. పేదలకు ఎంతో చేయాలన్న తపన ఆమెది. ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించి 29 ఏళ్లు పూర్తయ్యాయి. దాని సేవలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మూలమూలలకూ విస్తరించాయి. మేనేజింగ్ ట్రస్టీగా పేదలకు సేవ చేయడానికే ఆమె ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లో ఈ రోజు ఎన్టీఆర్ ట్రస్ట్ తన విస్తృతితో ఉన్నతస్థానంలో ఉంది. పేదలకు ఉచిత విద్య, వసతి చేకూర్చాలన్న సమున్నత ఆశయంతో ఆ రోజుల్లో తొలుత గండిపేటలో ఎన్టీఆర్ స్కూల్ ఆరంభించారు.

# సవాళ్లు దాటుతూ సమాజసేవలో...







బసవతారకం ఆసుపత్రికి పాతికేళ్లు నిండుతున్న ఈ సందర్భం చాలా ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ ఆసుపత్రి ఆలోచన పురుడు పోసుకున్న రోజు నుంచి జరిగిన అనేక సంఘటనలకు, కార్యక్రమాలకు, అభివృద్ధికి నేను ప్రత్యక్ష సాక్షిని. ఎన్టీఆర్ సినీ రంగంలో ఉన్నప్పుడే నాకు ఆయనతో కొంత పరిచయం ఉంది. కానీ వ్యక్తిగతంగా కలిసింది తక్కువే. ఎన్టీఆర్ సతీమణి బసవతారకం క్యాన్సర్ బారినపడటంతో ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు అమెరికా వచ్చారు. ఆ సమయంలో నేను 'స్లోన్ కేటరింగ్'లో పనిచేసేవాడిని. నేను ఆమెకు క్యాన్సర్ తగ్గించటానికి వైద్యం ప్రారంభించాను. ప్రపంచవ్యాప్తంగా అనేక మంది వైద్య నిపుణులు ఉండగా-- ఎన్టీఆర్ కుటుంబం నన్ను ఎంపిక చేసుకోవటం గర్వకారణమనే చెప్పాలి. నాకు వారి కుటుంబంతో మంచి సంబంధం ఏర్పడింది. ఒక రోజు ఆమె, తన కుటుంబ సభ్యులు మా ఇంటికి వచ్చారు. అప్పుడు ఆమె తన మనసులో ఉన్న ఆవేదనను నాతో పంచుకున్నారు. "డాక్టర్ గారు.. నేను ఒక ముఖ్యమంత్రి భార్యను కాబట్టి ఇంత దూరం వచ్చి వైద్యం చేయించుకోగలిగాను. కానీ మన రాష్ట్రంలోని సామాన్యుల పరిస్థితి ఏమిటి? వాళ్ల కోసం మీరే ఒక పెద్ద క్యాన్సర్ ఆసుపత్రి కట్టించాలి.. నేను ఎన్టీఆర్ గారికి కూడా చెబుతాను" అన్నారు. ఆసుపత్రికి బీజం పడటానికి ఆమె మాటలే కారణం. ఆమె ఇండియాకు తిరిగి వెళ్లిన తర్వాత ఎన్టీఆర్‌తో తన కోరిక గురించి చెప్పారు. కానీ ఆ కోరిక తీరకుండానే ఆమె మరణించారు. కానీ బసవతారకం కోరిక మాత్రం ఎన్టీఆర్ మనసులో నిలిచిపోయింది. దీనితో ఆయన ఆసుపత్రి ప్రారంభానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆసుపత్రిని ఎలా స్థాపించాలి? ఎలా నిర్వహించాలి? లాంటి అనేక విషయాల కోసం ఆయన నన్ను సంప్రదించటం మొదలుపెట్టారు. న్టీఆర్ సీఎంగా-- బసవతారకం ఆసుపత్రికి హైదరాబాద్‌లో స్థలాన్ని కేటాయించారు. కొండలు, రాళ్లు, రప్పలతో ఉన్న ఆ ప్రాంతాన్ని పది రోజుల్లోనే శుభ్రం చేయించి శంకుస్థాపనకు అద్భుతమైన ఏర్పాట్లు చేశారు. తాజ్ కృష్ణ హోటల్ నుంచి బంజారాహిల్స్ దాకా 'యూఎస్ఏ నుంచి వస్తున్న డాక్టర్ నోరికి స్వాగతం' అనే పోస్టర్లు పెట్టించారు. ఆ రోజు వేదికపై ఎన్టీఆర్ మాట్లాడుతూ 'నేను అందరికీ హీరో కావొచ్చు. కానీ వైద్య రంగంలో మన తెలుగువాడైన డాక్టర్ నోరి దత్తాత్రేయుడుగారే మనందరికీ హీరో' అని ప్రశంసించడం నా జీవితంలో మర్చిపోలేను. కార్యక్రమం పూర్తయిన తర్వాత ఎన్టీఆర్ నన్ను లంచ్‌కు ఆహ్వానించారు. ఎన్టీఆర్ భోజన ప్రియుడు. అందరికీ కొసరి కొసరి వడ్డించటం ఆయనకు ఒక సరదా! నేను అమెరికాలో ఉన్నాను కాబట్టి నాన్‌వెజిటేరియన్ అనుకున్నారేమో.. నా కోసం ప్రత్యేకంగా వైజాగ్ నుంచి రొయ్యలు తెప్పించారు. నేను స్వచ్ఛమైన వెజిటేరియన్‌ను. 'డాక్టర్ గారు.. మీ కోసం ప్రత్యేకంగా రొయ్యలు తెప్పించాం..' అని ప్లేటులో వడ్డించారు. నా చుట్టుపక్కల క్యాబినెట్ మంత్రులు కూర్చున్నారు. నాకు ఎలా రియాక్ట్ కావాలో అర్థం కాలేదు. టేబుల్ కింద ఒక చిన్న గిన్నె పెట్టి-- ఆయన పక్కకు చూస్తున్నప్పుడు రొయ్యలు దాంట్లో వేసేవాడిని! అలా ఆ రోజు లంచ్‌ను మేనేజ్ చేశా! విధి ఎప్పుడూ ఒకేలా ఉండదు. రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారాయి. చెన్నారెడ్డి ప్రభుత్వం రావడంతో ఈ ప్రాజెక్టుకు బ్రేకులు పడ్డాయి. ఒక దశలో ప్రాజెక్ట్ పూర్తిగా ఆగిపోయి, సరిహద్దు గోడలు మాత్రమే మిగిలాయి. మాకు తీవ్ర నిరాశ ఎదురయింది. ఒక రోజు నేను, డాక్టర్ కాకర్ల సుబ్బారావు, డాక్టర్ కోడెల శివప్రసాద్ కలిసి ఎర్రమంజిల్‌లోని ఒక ఇరానీ హోటల్‌లో కూర్చుని టీ తాగుతున్నాం. 'నోరి గారు.. ఇది ఇక ముందుకు వెళ్లేలా లేదు. ఎవరూ ముందుకు రావట్లేదు' అని వాళ్లిద్దరూ నాతో అన్నారు. కొద్దిసేపు ప్రాజెక్టును ఎలా ముందుకు తీసుకువెళ్లాలో మాట్లాడుకున్నాం. 'ఆ పెద్దాయన ఎంతో ఆశతో పునాది వేశారు. దీనిని మనం ఎలాగైనా ముందుకు తీసుకువెళ్లాలి. ఒక ఆరు నెలలు గట్టిగా ప్రయత్నిద్దాం.. ఏదో ఒకటి చేద్దాం' అన్నాను. కానీ ఏం చేయాలో.. ఎలా చేయాలో నాకు కూడా అర్థం కాలేదు. నేను అమెరికాకు వచ్చేశాను. అక్కడి నుంచి ఒక అంతర్జాతీయ లెక్చర్ కోసం జెరూసలేంలోని 'హదాసా' క్యాన్సర్ సెంటర్‌కు వెళ్లాను. ఆ సెంటర్ హెడ్ నా స్టూడెంట్. అతనిని-- 'మీది పెద్ద డబ్బున్న దేశం కాదు కదా, ఇంత పెద్ద ఆసుపత్రి ఎలా కట్టారు?' అని అడిగాను. "మాకు వాషింగ్టన్‌లో ఒక మహిళా సంఘం (హదాసా విమెన్స్ ఆర్గనైజేషన్) ఉంది. వారు మాకు ఫండ్స్ సేకరించి పంపుతారు' అని చెప్పాడు. ఆ మాటలు నాలో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి. అమెరికాకు వచ్చిన వెంటనే ఇతర మిత్రులతో కలిసి 'అమెరికన్ తెలుగు విమెన్స్ ఆర్గనైజేషన్' (అట్వా)ను రిజిస్టర్ చేశాను. ఆ సంస్థకు మహిళలనే బాధ్యులుగా చేశాం. డాక్టర్ తులసి పోలవరపును అధ్యక్షురాలిగా, నా సతీమణి డాక్టర్ సుభద్ర నోరిని వైస్ ప్రెసిడెంట్‌గా నియమించాం. బసవతారకం ఆసుపత్రికి నిధుల కోసం ఫండ్ రైజింగ్ కార్యక్రమాలు ప్రారంభించాం. మొదటి కార్యక్రమంలోనే సుమారు ఐదు కోట్ల రూపాయల నిధులు సమకూరాయి. ఆ తర్వాతి కాలంలో కూడా అనేకసార్లు ఫండ్ రైజింగ్ కార్యక్రమాలు నిర్వహించాం. కేవలం డబ్బులు పంపటం మాత్రమే కాకుండా అత్యాధునిక మిషన్లను, టెక్నాలజీని కొనుగోలు చేసి ఆసుపత్రికి పంపటం మొదలుపెట్టాం. 'ఇంతింతై వటుడింతై..' అన్నట్లు ఆసుపత్రి నా కళ్ల ముందే పెరుగుతూ వచ్చింది. అనేక మంది దాతలు ఆసుపత్రి అభివృద్ధిలో తోడ్పడ్డారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక సీఎస్ఆర్ ఫండ్స్, ఎంపీల నుంచి ఫండ్స్ ఇప్పించడమే కాకుండా టాటా ఇనిస్టిట్యూట్ ద్వారా రూ.15 కోట్లతో ఒక రీసెర్చ్ వింగ్‌ను కూడా ఏర్పాటు చేయించారు. ఈ ఆసుపత్రికి మొదట డాక్టర్ శివప్రసాద్, ఆ తర్వాత డాక్టర్ కాకర్ల సుబ్బారావు చైర్మన్లుగా వ్యవహరించారు. ఆ తర్వాత బాలకృష్ణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నందమూరి కుటుంబం నుంచి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటి వ్యక్తి ఆయనే. ఆసుపత్రి నిర్వహణలో కూడా స్టార్‌నని బాలకృష్ణ నిరూపించుకున్నారు. సబ్జెక్టును చురుగ్గా అర్థం చేసుకుంటూ, ఎన్నో ఒత్తిళ్లు తట్టుకుంటూ ఒక సమర్థవంతమైన అడ్మినిస్ట్రేటర్‌గా ఆసుపత్రి అభివృద్ధిలో క్రియాశీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ ప్రయాణంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి కూడా మాకు తోడ్పాటును అందిస్తున్నారు. సాధారణంగా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులలో 'క్యాన్సర్ కేర్' ఒక విభాగం మాత్రమే. కానీ బసవతారకం ఆసుపత్రిని కేవలం క్యాన్సర్ చికిత్స, నివారణల కోసమే ప్రారంభించాం. అతి తక్కువ ఖర్చుతో సమర్థమైన క్యాన్సర్ చికిత్సను అందించే ఆసుపత్రిగా మంచి పేరు తెచ్చుకుంది. ఒక సాధారణ కార్పొరేట్ ఆసుపత్రిలో ఏడాది పొడవునా చూసే క్యాన్సర్ కేసులు.. బసవతారకం ఆసుపత్రిలో ఒక నెలలోనే చూస్తారు. ఇక ఆసుపత్రి ప్రారంభంలో ఉన్న పాత తరం బోర్డు మెంబర్లలో మిగిలింది నేనొక్కడినే! పాతకు.. కొత్తకు మధ్య ఉన్న సంధానకర్తను కూడా నేనే! ఈ ఆసుపత్రి ఏ ఆశయాలతో, విలువలతో ప్రారంభమైందో-- వాటిని కాపాడాల్సిన బాధ్యత కూడా నాపై ఉందనేది నా ప్రగాఢ నమ్మకం. ఈ ఆసుపత్రిని మరింత ముందుకు తీసుకువెళ్లాలనేది మా లక్ష్యం. దీనిలో భాగంగానే 'అట్వా'ను 'ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆర్గనైజేషన్'గా మార్చాం. దీనికి నా భార్య సుభద్ర నోరి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. దీని ద్వారా అమెరికా నుంచి ఫండ్స్ సేకరించి హైదరాబాద్ ఆసుపత్రితో పాటు అమరావతిలో నిర్మిస్తున్న ఆసుపత్రికీ ఇవ్వబోతున్నాం. హైదరాబాద్ ఆసుపత్రిలో చేసిన అద్భుతాలను అమరావతిలోనూ పునరావృతం చేయాలనేదే మా లక్ష్యం. మంచిని కోరే ప్రజలందరి సహకారంతో దానిని సాధించగలమనే నమ్మకం ఉంది.

# రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసిన బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

జూన్ - 20- హంస కలంవార్త )

బెల్లంపల్లి నియోజకవర్గం బెల్లంపల్లి పట్టణంలోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించి రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసిన బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర రైతులకు అమలుకాని హామీలిచ్చి మోసపూరిత మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన గ్యారెంటీలు, హామీలను విస్మరించిందని తెలిపారు.
6 గ్యారెంటీలు, 420 హామీలలో రైతులకు సంబంధించిన రైతుభరోసా, రైతుభీమా, రైతు రుణమాఫీ, బోనస్ లాంటి గ్యారెంటీలు, హామీలను ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 100 రోజుల్లోనే పూర్తిస్థాయిలో అమలు చేస్తామని బోగస్ మాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి సుమారు 30 నెలలు గడిచినా నేటికి ఒక్క గ్యారెంటీ, హామీను కూడా పూర్తిచేయలేదని విమర్శించారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం రైతులకు సరిపోయే విధంగా సాగునీరు, నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యేదని, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఆ పరిస్థితులు లేవని




తెలిపారు. కనీసం రైతుల నుండి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయలేని, రైతులకు సరైన సమయంలో యూరియా కూడా సరఫరా చేయలేని పరిస్థితుల్లో కూడా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లేదని తెలిపారు. ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రశ్నిస్తున్న రైతులను అధికారబలంతో అణిచివేసి అక్రమ కేసులను బనాయించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తమ తీరు మార్చుకుని రైతులకు ఇచ్చిన అన్ని గ్యారెంటీలను, హామీలను వెంటనే పూర్తిస్థాయిలో అమలుచేయడమే కాకుండా రైతులనుండి ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అలాగే రైతులకు సరిపడా యూరి యాను కూడా సరఫరా చేయాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన బి ఆర్ ఎస్ పార్టీ తరుపున ఉద్యమి స్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

# కూకట్‌పల్లి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్

-జాతీయ లోక్ అదాలత్ ద్వారా భారీ సంఖ్యలో కేసుల పరిష్కారం

( జూన్ - 20- హంస కలంవార్త )

మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో శనివారం రోజు కూకట్‌పల్లి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ (నేషనల్ లోక్ అదాలత్ ) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. వెంకటేశ్వరరావు , 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీ రామ్ ప్రసాద్ , ఇతర న్యాయమూర్తులు, డీసీపీ రితి రాజ్ మరియు వారి బృందం, కూకట్‌పల్లి కోర్టు జనరల్ సెక్రటరీ సురేందర్ గౌడ్ మరియు కార్యవర్గ సభ్యులు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రకాల కేసులకు సంబంధించిన లిటిగెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరస్పర



అవగాహనతో అనేక కేసులు విజయవంతంగా పరిష్కారం కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు,లిటిగెంట్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నేషనల్ లోక్ అదాలత్ విజయవంతం చేశారు.

# విశ్వకర్మ ఆర్ట్స్ అధినేత అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఆఫ్ క్రైమ్

( జూన్ - 20- హంస కలంవార్త )

హైదరాబాద్ గౌరవనీయులు బ్రహ్మశ్రీ కమ్మరిపల్లి కిరణ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రంగబాబు ఇటీవల స్కిల్ ఇండియా కాంపిటీషన్స్ లో మన వడ్రంగి వృత్తిలో నేషనల్ ఛాంపియన్గా గెలిచినటువంటి యశ్వంత్ ఆచారి రాబోయే సెప్టెంబర్ 20వ తారీకు చైనాలో జరగబోతున్నటువంటి వడ్రంగి వృత్తి కళా పోటీలలో వరల్డ్ ఛాంపియన్గా గెలవాలని ఇరువురు ఆకాంక్షించడమైనది అలాగే భారతదేశ గృహ నిర్మాణంలో కీలక భూమిక పోషిస్తూ ఉన్నటువంటి సంప్రదాయ వడ్రంగి వృత్తి మరింత గౌరవప్రదంగా ఎదగాలని ఆధునికత సంతరించుకున్న కొత్త టెక్నాలజీ మనవారికి అందరికీ అందాలని దానికిగాను విశ్వకర్మ ఆర్ట్స్ సహకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కావాలని రాష్ట్ర కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షులు



కోరడం జరిగింది నాలుగు నెలల అధునాతన వడ్రంగి పని విధానం ట్రైనింగ్ పూర్తి చేసుకున్న టువంటి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రధాన ఉత్సవానికి ముఖ్యఅతిథిగా తమరు రావాలని కోరడం జరిగింది రాష్ట్రంలోని ఇతర విషయాలు కూడా కిరణ్ కుమార్ తో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది

# కృష్ణా నదీ తీర గ్రామాల్లో నీటి కష్టాలకు ఉత్తమ్ కొత్త ఆశలు

-రూ.394 కోట్ల లిఫ్ట్ పథకం సాకారానికి చేరువలో
-రైతుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న మంత్రి ఉత్తమ్

( జూన్ - 20- హంస కలంవార్త )

జిల్లాలోని వేలాది రైతు కుటుంబాలకు తరతరాలుగా అది ఒక బాధాకరమైన విరోధాభాస. కళ్ల ముందే ఉత్తుంగ తరంగాలతో కృష్ణా నది ప్రవహిస్తున్న ప్పటికీ,వారి పొలాలు మాత్రం ఎప్పుడూ ఎండిపోయే ఉండేవి. శనివారం ఆ సుదీర్ఘ నిరీక్షణకు త్వరలోనే తెరపడనుందనే సంకేతాలు కనిపించాయి. నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పుట్టినరోజును పురస్క రించుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వందలాది మంది రైతులు తరలివచ్చారు. అయితే ఈ వేడుకలు కేవలం పూలదండలు, కేరింతలకే పరిమితం కాకుండా, ఒక గొప్ప భరోసానిచ్చే విధంగా సాగాయి. ఉత్సాహంగా తరలివచ్చిన జనసందోహం మధ్య నిలబడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి,రూ.394 కోట్ల వ్యయంతో చేపడుతున్న రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం ప్రగతిని సమీక్షించారు. దశాబ్దాలుగా తీవ్ర నీటి కొరతతో అల్లాడుతున్న టెయిల్-ఎండ్ (చివరి ఆయకట్టు) ప్రాంతాలకు కృష్ణా జలాలను తరలించేందుకు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రూపొందించారు. మంత్రికి శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన చాలా మంది రైతులకు ఈ సందర్భం వ్యక్తిగతంగానూ, ప్రతీకాత్మకంగానూ ఎంతో ప్రత్యేకమైనది. తమ భూములకు శాశ్వతంగా సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు పూర్తి కావడమే ఈ ప్రాంతానికి లభించే అతిపెద్ద పుట్టినరోజు కానుక అని వారు పేర్కొన్నారు. ప్రాజెక్టు ముఖ్యాంశాలు ముక్తేశ్వరాపురం మేజర్,గణపవరం మేజర్ ఆయకట్టు పరిధిలోని దాదాపు 14,000 ఎకరాలకు నమ్మకమైన నీటి సరఫరా అందించడం. అదనపు ప్రయోజనాలుగా కోదాడ, హుజూర్‌నగర్,చిలుకూరు మరియు పరిసర మండలాల్లోని చెరువులను నింపడం,నీటి భద్రతను మెరుగుపరచడం ప్రస్తుత ప్రగతిని పరిశీలిస్తే.. .మొత్తం 22 కిలోమీటర్ల ప్రెజర్-మెయిన్ పైప్‌లైన్‌లో, 16 కిలోమీటర్ల ఫ్యాబ్రికేషన్ పూర్తయింది. అందులో 6 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రధాన సివిల్ పనులు వేగంగా జరుగుతుండగా, మిగిలిన పనులు రాబోయే వారాల్లో మరింత వేగం పుంజుకోనున్నాయి.

-లబ్ధి పొందే గ్రామాలు

ఈ ప్రాజెక్టు ద్వారా కందిబండ, రామాపురం, హుజూర్‌నగర్, కందిబండ,గణపవరం,కూచిపూడి, ఎర్రవరం ,రామలక్ష్మీపురం,పీకే తండా, తొగర్రాయి, పాలనగరం తదితర గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ గ్రామాల రైతులకు ఈ ప్రాజెక్టు కేవలం ఒక ఇంజనీరింగ్ నిర్మాణం మాత్రమే కాదు,సాగునీటి సరఫరా వ్యవస్థలో చివరి భూములకు సైతం నీరు అందుతుందనే ఒక సుదీర్ఘ నిరీక్షణకు దక్కిన భరోసా. ఇప్పటివరకు వీరు కేవలం రుతుపవనాల పైన, అడుగంటుతున్న భూగర్భ జలాల పైన మాత్రమే ఆధారపడాల్సి వచ్చేది. ఈ పర్యటనలో రైతులను ఉద్దేశించి



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడు తూ,టెయిల్-ఎండ్ ఆయకట్టులోని ప్రతి ఎకరానికి వారి న్యాయమైన నీటి వాటాను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరు ద్ఘాటించారు. నీటిపారుదల అభివృద్ధి అనేది అత్యంత వెనుకబడిన రైతులకు సైతం చేరాలని,కాలువ చివరన ఉన్నారనే కారణంతో ఏ గ్రామానికి కూడా నదీ జలాల ఫలాలు అందకుండా పోకూడదని ఆయన నొక్కి చెప్పారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఈ ప్రాంతానికి ప్రధాన నీటిపారుదల జీవనాడి అయినప్పటికీ,లోటుపాట్లను భర్తీ చేయ డానికి మరియు నీటిని సమానంగా పంపిణీ చేయడానికి రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం వంటి అనుబంధ ప్రాజెక్టులు ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూపుది ద్దుకుంటున్న భారీ పైప్‌లైన్‌పైనే ఈ ప్రాంత రైతులు తమ ఆశలన్నీ పెట్టుకున్నారు. కృష్ణా నదీ తీర గ్రామాల ప్రజల జీవితాల్లో, జీవనోపాధిలో ఈ నది త్వరలోనే ఒక నమ్మకమైన భాగస్వామిగా మారబోతోందన్నారు.

## రైతులకు భరోసా కాదు.... రైతులతో పాటు రాష్ట్రంలోని అన్నీ వర్గాల ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం ఈ రేవంత్ ప్రభుత్వం: బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

( జూన్ - 20- హంస కలంవార్త )



చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి పాలనను గాలికి వదిలేసి పేర్ల మార్పుతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి ఈ రేవంత్ ప్రభుత్వం పాలనా తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

-ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

పేరుకే ప్రజా పాలన కానీ, కానీ రాష్ట్రంలో ప్రజలను హింసించే పాలనతో రాక్షస పాలన కొనసాగిస్తూ ఉన్నారు. రాష్ట్రంలోని రైతులను కెసిఆర్ కడుపులో పెట్టుకొని చూసుకుంటూ సమయానికి విత్తనాలను, యూరియాను అందించి పండించిన పంటను కొని రాష్ట్ర రైతాంగానికి బంగారు బాటలు వేసింది పెద్దలు కేసీఆర్ . కానీ నేడు రైతులకు సకాలంలో యూరియాను అందించలేక, పండించిన పంటను కొనకుండా రాష్ట్ర రైతాంగాన్ని హింసిస్తా ఉంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం. అమలు కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మూడేళ్లుగా మోసం చేస్తా ఉంది. ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ప్రజలు తన మాటను నమ్మరని తెలిసి ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీ ని రాష్ట్రానికి తీసుకొచ్చి రైతులకు డిక్లరేషన్ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రైతుబంధు పేరును రైతు భరోసాగా పేరు మార్చి రైతాంగాన్ని మోసం చేసింది. రెండు లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ పేరుతో రుణమాఫీ చేశామంటూ, తూతూ మంత్రంగా రుణమాఫీ చేసి చేతులు దులుపుకుంది. మా నియోజకవర్గం కుత్బుల్లాపూర్ లోని దాదాపు 600 మంది రైతులు ఉంటే 13 మందికి రుణమాఫీ ని చేసి చేతులు దులుపుకుంది ఈ ప్రభుత్వం. రైతు రుణమాఫీ పై ఊదరగొట్టిన ప్రభుత్వాన్ని అసెంబ్లీ వేదికగా రుణమాఫీ పై ప్రశ్నించగా ప్రభుత్వం తోక ముడుచుకొని పారిపోయింది. సీఎం సొంత ఊరైన కొండారెడ్డిపల్లి లోనే 100% రుణమాఫీ చేయలేని చేతగాని దద్దమ్మ ప్రభుత్వం ఈ ప్రభుత్వం. దేశానికి అన్నం పెట్టే రైతన్న అకాల మరణం చెందితే వారి కుటుంబానికి తాను అండగా ఉన్నాను అంటూ బిఆర్ఎస్ అధినేత, పెద్దలు కేసీఆర్ గారు రైతు బీమాను ఏర్పాటు చేసి ఎంతోమంది రైతులకు రైతు బీమాను అందించారు. కానీ గత రెండున్నర సంవత్సరాలుగా ఎంతోమంది రైతులు అకాల మరణం చెందితే రైతు బీమాను ఎగ్గొట్టి రైతులను మోసం చేసిన ప్రభుత్వం ఈ రేవంత్ ప్రభుత్వం. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా వారి ప్రాణాలను తీస్తుంది. రైతులకు యూరియాతో పాటు రైతు బంధును అందిస్తూ వ్యవసాయాన్ని పండుగగా మార్చి దేశంలోనే అత్యధిక ధాన్యం దిగుబడి చేసే రాష్ట్రంగా తెలంగాణ అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ గారిదయితే, పండించిన పంటను కేంద్రం అనుమతి ఉంటే గాని కొనలేని నిస్సహాయ స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. రైతు బీమా పథకాన్ని ప్రతి ఒక్కరికి అందేలా చేయాలి. లేదంటే రైతుల తరుపున బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుంది.

## టీటీడీ కళ్యాణ మండపంలో భువనేశ్వరి బర్త్డే,

( జూన్ - 20- హంస కలంవార్త )



కల్లూరు మండల పరిధిలో టీటీడీ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భార్య భువనేశ్వరి బర్త్డే సర్మినేషన్ టిటిడి కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు తెలుగుదేశం పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ నాయకుడు నారపోగు ప్రసాద్ బాబు ,మహిళల తో కేక్ కట్టింగ్ చేసి స్వీట్లు మిఠాయిలు పంచారు ఈ కార్యక్రమంలో మహిళ సోదరీమణుని రుక్మిణి మాట్లాడుతూ ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా ఎన్టీఆర్ ఆశయాల స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎందరి జీవితాలనో ప్రభావితం చేసిన నారా భువనేశ్వరి ఒక సమాజ సేవకురాలే కాదు... హెరిటేజ్ సంస్థ ఎండీగా ఒక ప్రతిభవంతురాలైన వ్యాపారవేత్తగా.. పలుమార్లు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రికి భార్యగా యంగ్ డైనమిక్ లీడర్ ఏపీ మంత్రికి తల్లిగా సక్సెస్ అందిపుచ్చుకున్న నారా భువనేశ్వరి పుట్టిన శనివారంఅభిమాన మహిళలు టిటిడి కళ్యాణ మండపం కేక్ కటింగ్ చేసి టపాసులు కాల్సి సంబరాలు నిర్వహించేను వారిలో సత్తుపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకుడు నారపోగు ప్రసాద్ బాబు మహిళలు సునీత, రుక్మిణి, దాసు, రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు

## రూ 30వేల కోట్లు నిధులు విద్యాశాఖకు కేటాయించడం ద్వారా

( జూన్ - 20- హంస కలంవార్త )



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతని ఇస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. బాలానగర్ మండల పరిధిలోని బబ్బుగూడ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించిన సందర్భంగా రేణుక, స్ఫూర్తి, విగ్నేష్ లకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గుర్తింపు గౌరవం విద్య ద్వారానే లభిస్తాయని పేర్కొన్నారు .అందరు విద్యార్థులు విజయమే లక్ష్యంగా విద్యలో పోటీపడి చదవాలన్నారు ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలను విద్యార్థులు అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని రమేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, డివిజన్ ప్రెసిడెంట్ సతీష్ గౌడ్, సుధాకర్ రెడ్డి ఏఎంసీ డైరెక్టర్ , రవి గౌడ్, నరసింహులు ,రాజేష్ ,గోపాల్ చౌదరి ,సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

### అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో

( జూన్ - 20- హంస కలంవార్త )



చేపడుతున్న డ్రైనేజ్ లైన్ మరమ్మత్తు పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎల్లమ్మబండ ప్రధాని రహదారిలో డ్రైనేజీ లైన్ జామ్ అయ్యి డ్రైనేజీ మీరు పొంగి రోడ్ల మీదకు రావడంతో మహావీర్ నగర్ కాలనీ మరియు సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యను శేర్లింగంపల్లి శాసనసభ్యులు పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ దృష్టికి మరియు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, వారు వెంటనే స్పందించి మరమ్మత్తు పనులు చేపడుతున్నారని తెలియజేశారు. డ్రైనేజ్ లైన్ మరమత్తు పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరేశం, హరీష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చేపట్టాలని కూకట్ పల్లి, బాలానగర్ మండలాల విద్యాశాఖాధికారులకి వినతి పత్రం సమర్పించిన బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు



( జూన్ - 20- హంస కలంవార్త )

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ మరియు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు తూము నిఖిల్ కుమార్ మరియు బిఆర్ఎస్ వి రాష్ట్ర నాయకులు అశ్వంత్ కుమార్ కూకట్ పల్లి, బాలానగర్ మండలాల విద్యాశాఖాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజలను దోచుకుంటున్నాయని, విద్యను వ్యాపార సంస్థలుగా మార్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేనందువలన పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తున్నారని , మౌలిక సదుపాయాలు కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా హాజరు శాతం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు, జిల్లా అక్షయ్, సూర్య ,పల్లపు గిరీష్, దుర్గా ప్రసాద్, సిద్దార్థ్ తదితరులు పాల్గొన్నారు.

## మానవతా సేవలో పోలీసు శాఖ

-వృద్ధులకు పండ్లు,నిత్యావసర సరుకులు పంపిణీ

-“మా” అభాగ్యుల వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ




( జూన్ - 20- హంస కలంవార్త )

గంభిరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మా అభాగ్యుల వృద్ధాశ్రమాన్ని శనివారం రోజున జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సందర్శించారు.ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు,అవసరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం వృద్ధులకు పండ్లు,బియ్యం,కిరాణా సరుకులు మరియు ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.సమాజంలో వృద్ధులు,నిరాశ్రయులు,అనాథల సంక్షేమం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.వృద్ధుల సేవ చేయడం గొప్ప మానవతా ధర్మమని,వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు.అవసరమైన వారికి సేవలు అందించడంలో జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి,సి.ఐ వెంకటేష్,ఎస్.ఐ శ్రీకాంత్ వృద్ధాశ్రమ సభ్యులు ఉన్నారు.

## జిల్లాకు మరింత గుర్తింపు తేవాలి

-ప్రభుత్వ విప్ విజయరమణారావు

-జిల్లా కలెక్టర్ కు ఘన సన్మానం

( జూన్ - 20- హంస కలంవార్త )



విద్య ప్రమాణాల పెంపులో పెద్దపల్లి జిల్లా అగ్రగామిగా నిలిచినందుకు చాలా ఆనందంగా ఉందని, జిల్లాకు మరింత గుర్తింపు తెచ్చేలా పని చేయాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. జిల్లాను విద్యా ప్రమాణాల పెంపులో అగ్రగామిగా నిలిపినందుకుగానూ హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో తెలంగాణ గవర్నర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల చేతుల మీదుగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షని అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీహర్షను ప్రభుత్వ విప్ విజయరమణారావు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపు విషయంలో కా ఎద్దపల్లి జిల్లాకు గుర్తింపు రావడం ఎంతో గొప్ప విషయమని, రానున్న రోజుల్లో పెద్దపల్లి జిల్లాకు మరెన్నో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

# జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు

( జూన్ - 20- హంస కలంవార్త )

ర్టులలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా త్వరగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు తెలిపారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను ఘనంగా నిర్వహించి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు సివిల్, క్రిమినల్ కేసులను ఇరుపక్షాల రాజీ మార్గం ద్వారా విజయవంతంగా పరిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ...లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమైతే కక్షిదారులకు కోర్టు ఫీజును తిరిగి ఇస్తామని వెల్లడించారు.ఎలాంటి ఖర్చు లేకుండా, ఇరుపక్షాలకు న్యాయం జరిగే ఈ సువర్ణ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ...ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా, సమయం,



డబ్బు వృథా కాకుండా చూసుకోవడానికి లోక్ అదాలత్ ఒక అద్భుతమైన వేదికని కొనియాడారు. కక్షిదారులు పాత పగలను వీడి,పరస్పర అంగీకారంతో కేసులను ముగించుకుని ప్రశాంత జీవనాన్ని గడపాలని సూచించారు.అనంతరం జిల్లా న్యాయమూర్తి, కలెక్టర్,ఎస్పీలు సైబర్ క్రైమ్ బాధితునికి లక్ష రూపాయల ప్రొసీడింగ్



కాపీని,భూసేకరణ లబ్ధిదారులకు 65,33,437/- విలువ గల రూపాయల చెక్కు ను అందజేశారు చేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,బార్ అసోసియేషన్ ప్రతినిధులు నగేష్,ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదుల సంఘం ప్రతినిధులు,కోర్టు సిబ్బంది,కక్షిదారులు, పాల్గొన్నారు.

## స్త్రీ నిధి రికవరీ, రుణాల పంపిణీ నూరు శాతం చేయాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

-మన స్త్రీ నిధి యాప్ వినియోగం తప్పనిసరి

-అవకతవకలకు పాల్పడే వి ఒ ఎ లు, బకాయిలు చెల్లించని సంఘాలపై చర్యలు.

( జూన్ - 20- హంస కలంవార్త )

స్త్రీ నిధి రికవరీని నూరు శాతానికి పెంచడంతో పాటు రుణాల పంపిణీని శత శాతం పూర్తి చేసే దిశగా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధ్యక్షతన నిర్వహించిన స్త్రీ నిధి జిల్లా సమీక్షా సమావేశం లో రికవరీ, రుణాల పంపిణీ, డిజిటల్ సేవల వినియోగం, సుస్థిర జీవనోపాధులు, ఆర్థిక క్రమశిక్షణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ నిధి రుణ చెల్లింపులు పూర్తిగా డిజిటల్ విధానంలో జరగాలని, అన్ని రికవరీలు “మన స్త్రీ నిధి యాప్” ద్వారానే బదిలీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లావాదేవీలలో పారదర్శకత, వేగవంతమైన అడ్జస్ట్‌మెంట్, సమగ్ర సమాచార నిర్వహణ కోసం అన్ని స్థాయిలలో యాప్ వినియోగాన్ని మరింత విస్తరించాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడే వి ఒ ఎ ల అంశంపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించని స్వయం సహాయక సంఘాలపై అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు రికవరీతో పాటు ఇతర విధుల నిర్వహణలో స్త్రీ నిధి, సెర్ప్, మెప్మా సిబ్బందికి అన్ని స్థాయిలలో పూర్తి సహకారం అందించాలని, విధుల నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జూన్ నెలాఖరు నాటికి జిల్లా రికవరీని 70 శాతానికి పెంచాలని, క్రెడిట్ లక్ష్యాన్ని కనీసం 30 శాతానికి చేరేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జీవనోపాధి రుణాల మంజూరును పెంచడంతో పాటు జీరో రికవరీ సంఘాల సంఖ్యను సున్నాకు తీసుకురావాలని సూచించారు. జూలపల్లి, ఎలిగేడు, పాలకుర్తి, మంథని, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, శ్రీరాంపూర్, పెద్ద పల్లి మండలాల్లో రికవరీ పనితీరు మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జూన్ నెలాఖరు నాటికి గణనీయమైన పురోగతి సాధించేలా క్షేత్రస్థాయి



సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. మహిళల సుస్థిర జీవనోపాధుల అభివృద్ధికి స్త్రీ నిధి రుణాలను సమర్థవంతంగా వినియోగించేలా అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, అదే సమయంలో ఆర్థిక క్రమశిక్షణ, సకాలంలో రుణ చెల్లింపులు, క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి సహకారం అందించడం అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ ఎం . కాళిందిని, ఎ డి ఆర్ డి ఒ రవీందర్ , స్త్రీ నిధి ఆర్ ఎం ఆర్. దుర్గా ప్రసాద్ , జిల్లా సమాఖ్య అధ్యకురాలు స్వప్న కార్యదర్శి శోభా, కోశాధికారి జి . స్వప్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు వివిధ శాఖల అధికారులు, సెర్ప్, మెప్మా, స్త్రీ నిధి సిబ్బంది, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన..

-మధిర జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి దీప్తి వేముల

( జూన్ - 20- హంస కలంవార్త )

మధిర కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మధిర జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి దీప్తి వేముల మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను పరస్పర రాజీ ద్వారా త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం కలుగు తుందని తెలిపారు. న్యాయస్థానాల్లో సంవత్సరాల పాటు కొనసాగే వివాదాలను సులభంగా, తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో పరిష్కరించేందుకు లోక్ అదాలత్‌లు ఉత్తమ వేదికలని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా చెక్కు బౌన్స్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, బ్యాంకు రుణాలు, కుటుంబ వివాదాలు తదితర కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అనేక సివిల్ మరియు క్రిమినల్ కేసులను ప్రజల ముందు పరిష్కరించి అవార్డు కాపీలు అందజేశారు. లోక్ అదాలత్‌లో




కుదిరిన రాజీ తీర్పులకు చట్టబద్ధత ఉండటంతో పాటు వాటిపై అప్పీల్‌కు అవకాశం ఉండదని, ఇరు పక్షాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆమె వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చావలి రామరాజు,ఏపీ పి జన్ను భద్రయ్య,పట్టణ సీఐ రమేష్,సబ్ ఇన్స్పెక్టర్స్ నవిత, విశ్వ తేజ,ఎం అబ్రహాం సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, డి జగన్మోహన్ రావు,బి పుల్లారావు, నంబూరి జనార్ద నరావు, పల్లపోతుల కృష్ణారావు,టి వెంకట్రావు,విజయ్ కుమార్, జే రమేష్,మాధురి తేజ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ‘పీఎస్ఆర్’ భరోసా

-44 కుటుంబాలకు ?10వేల చొప్పున ఆర్థిక సహాయం..

-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనతో ట్రస్ట్ వితరణ..

( జూన్ - 20- హంస కలంవార్త )

ఏదులాపురం : మున్సిపాలిటీ పరిధిలో గత నెల మరణించిన వ్యక్తుల కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కొండంత అండగా నిలిచింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు శనివారం బాధిత కుటుంబాలను నేరుగా కలిసి ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 44 కుటుంబాలకు ఒక్కో ఇంటికి ?10,000 చొప్పున నగదును పంపిణీ చేశారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న తమను ఆదుకునేందుకు మంత్రి పొంగులేటి, ట్రస్ట్ ప్రతినిధులు ముందుకు రావడంపై బాధిత కుటు ంబాలు కృతజ్ఞతలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏదులాపురం



మున్సిపాలిటీ అధ్యక్షుడు బానోత్ కిశోర్, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మీర అశోక్ నాయక్, గోనె భుజంగ రెడ్డి, వెంపటి రవి, వీరా రెడ్డి, మహేష్, భద్రకాళి, నూకల రామ్ మోహన్ రెడ్డి, రంజిత్ నాయక్, వెంకట నారాయణ, సాయి, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు పాల్గొని విజయవంతం చేశారు.

# మహిళా సాధికారత, యువతకు నైపుణ్యాభివృద్ధి

**-మాదకద్రవ్యాల నిర్మూలనకు సమష్టి కృషి అవసరం**

**-జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

( జూన్ - 20- హంస కలంవార్త )

ఆదిలాబాద్ జిల్లాలో మహిళా సాధికారత,యువతకు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు.తెలంగాణ ప్రభుత్వ చొరవతో మహిళా సాధికారతను పెంపొందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న నూతన 'ఎంప్లాయబిలిటీ స్కిల్స్ ట్రైనింగ్'కార్యక్రమం,'నషా ముక్త్ భారత్ అభియాన్' పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో విడుదల చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. .మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా ఎంప్లాయబిలిటీ స్కిల్స్ శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.అలాగే మత్తు పదార్థాల వినియోగ నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,నషా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్)జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని యువతుల కోసం ప్రత్యేకంగా ఉచిత'ఎంప్లాయబిలిటీ స్కిల్స్'శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల్లో నైపుణ్యాభివృద్ధి ,ఆర్థిక స్వావలంబన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. 2023, 2024 ,2025, 2026 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల యువతులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణలో ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ (ఏఐ),సాఫ్ట్ స్కిల్స్,ఫ్రంట్ ఎండ్ డెవలప్‌మెంట్,ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్,పైథాన్ ప్రోగ్రామింగ్,ఫండమెంటల్స్ వంటి అంశాలపై 45 రోజులపాటు శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ తరగతులు 2026 జూన్ 29 నుంచి స్థానిక టీటీడీసీ(టీ టీ డీ సి), డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రారంభమవుతాయని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ జూన్ 26,అర్హులైన యువతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 95027 864380 నంబర్‌ను సంప్రదించవచ్చని,క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం,దివ్యాంగులు, వయోవృద్ధులు,ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ, ఈగల్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో "నషా ముక్త్ భారత్ సప్తాహ్' 'కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా జూన్ 17 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు"నషా ముక్త్ భారత్ అభియాన్,వికసిత్ భారత్ కి పహచాన్"అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ముఖ్యంగా యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించడం,సమాజంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.మాదకద్రవ్యాల బారిన పడిన వారు లేదా సహాయం అవసరమైన వారు 14446 టోల్ ఫ్రీ నేషనల్ డీ-అడిక్షన్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు.అలాగే క్యూఆర్ కోడ్ ద్వారా మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ స్వీకరించడం, "నషా ముక్త్ మిత్ర" గా




నమోదు చేసుకోవడం ద్వారా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల రహిత సమాజమే అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి పునాది అని పేర్కొంటూ, యువత, విద్యార్థులు,ప్రజలు స్వచ్ఛం దంగా ముందుకు వచ్చి "నషా ముక్త్ భారత్ సప్తాహ్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ జగదీశ్వర్ రావు, డీడబ్ల్యూఓ మిల్కారిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి

**-జిల్లా రెవెన్యూ అధికారి రాంమూర్తి**

**-24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో కంట్రోల్ రూమ్ సేవలు..**

**-అత్యవసర సమయాలలో టోల్ ఫ్రీ నెంబర్ 1077 కు కాల్ చేయాలి...**

**-భారీ వర్షాలు, ఇతర అత్యవసర పరిస్థితులపై తక్షణ స్పందన..**

( జూన్ - 20- హంస కలంవార్త )

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కలెక్టరేట్ లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. రాంమూర్తి శనివారం తెలిపారు. జిల్లా కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో నిరంతరాయంగా పని చేస్తుందని అన్నారు. భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు, తదితర అత్యవసర పరిస్థితుల సమాచారాన్ని ప్రజలు వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1077 లేదా మొబైల్ నంబర్ 9063211298 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి జిల్లాలో నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలు, ఇతరాలపై కూడా ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి కాల్,



ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత శాఖలకు వెంటనే సమాచారం అందజేసి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయాల్లో కంట్రోల్ రూమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. రాంమూర్తి కోరారు.

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**-పెండింగ్ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలి**

**-సెప్టెంబర్ 15 వరకు అధికారులకు గడువు**

**-రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు**

**-పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి ప్రాజెక్టులపై సమీక్ష**

**-భూ సేకరణ ప్రక్రియను సమర్పించిన కలెక్టర్లు**

( జూన్ - 20- హంస కలంవార్త )

రాష్ట్రంలో సాగునీటి రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న వివిధ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ అంశాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి , గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో ప్రాజెక్టుల వారీగా, నియోజకవర్గాల వారీగా భూసేకరణ పురోగతిని మంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు. ఇప్పటివరకు ఎంత భూమి సేకరించబడింది, ఎంత భూమి పీడీ (ప్రాథమిక నోటిఫికేషన్) దశలో ఉంది, ఎంత భూమి పీఎం స్థాయిలో ఉంది, ఎన్ని అవార్డులు ప్రకటించారు, ఎంత పరిహారం చెల్లించారు, ఇంకా ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయనే అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల జిల్లాలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. ఆ దిశగా అధికారులు మరింత బాధ్యతతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న సమస్యలను సెప్టెంబర్ 15లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, సాగునీటి వనరుల విస్తరణ ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి వంటి ప్రాజెక్టులు పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా భూగర్భ జలాల మట్టం పెరిగి వ్యవసాయ రంగానికి కొత్త ఊపు వస్తుందని చెప్పారు. దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల ఆశలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకూడదని మంత్రి స్పష్టం చేశారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయమైన పరిహారం అందించడమే కాకుండా వారి సమస్యలను మానవీయ దృక్పథంతో పరిశీలించాలని సూచించారు. రైతుల అభ్యంతరాలు, భూవివాదాలు, పరిహారం చెల్లింపులకు సంబంధించిన అంశాలను ప్రత్యేకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సహకారంతోనే ప్రాజెక్టులు ప్రజల సహకారంతోనే ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయని, అందుకే రైతుల విశ్వాసాన్ని పొందే విధంగా అధికారులు వ్యవహరించాలని సూచించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. ప్రతి 15 రోజులు పురోగతిని సమీక్షిస్తూ నిర్ణీత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వేగవంతమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ....., జిల్లాలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే రైతాంగానికి శాశ్వత ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. సాగునీటి అందుబాటు పెరగడం ద్వారా వలసలు తగ్గి గ్రామీణ జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పరిష్కరించి పనులను మరింత వేగవంతం చేయాలని కోరారు. రైతులకు అందాల్సిన పరిహారంపై రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి అందుకు



అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయించేలా మంత్రి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలవనున్నట్లు తెలిపారు. భూ సేకరణ ప్రక్రియను సమర్పించిన కలెక్టర్లు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌లు తమ తమ జిల్లాల పరిధిలో కొనసాగుతున్న భూసేకరణ ప్రక్రియపై సమగ్ర నివేదికలను సమర్పించారు. ఇప్పటివరకు జరిగిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, పెండింగ్‌లో ఉన్న కేసులు, కోర్టు వివాదాలు, రైతుల అభ్యంతరాలు తదితర అంశాలపై వివరాలు వెల్లడించారు. భూ సేకరణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలను మంత్రికి వివరించారు. సందర్భంగా ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేష్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తమ నియోజకవర్గాల్లోని రైతుల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పరిహారం చెల్లింపులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పారదర్శకంగా భూసేకరణ ప్రక్రియ కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. ప్రాజెక్టుల వారీగా సేకరించిన భూమి, చెల్లించిన పరిహారం, పెండింగ్ పనులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను సమర్పించారు. నిర్ణీత గడువులోగా భూసేకరణ పూర్తిచేసి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో పాలమూరు రంగారెడ్డి విజయభాస్కర్ రెడ్డి, అదనపు కలెక్టర్ అమరేందర్, సాగు నీటి ప్రాజెక్టుల ఎస్సీలు, ఈ.ఈలు, ఏఈలు ఆర్డీవోలు, తాహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే, భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలి

**-అక్కినేపల్లి, లింగంపల్లి ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన జిల్లా కలెక్టర్ అంకిత్..**




( జూన్ - 20- హంస కలంవార్త )

జిల్లాలో ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే, నాన్-క్యాడస్ట్రల్ సర్వే, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం దమ్మపేట మండలంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దమ్మపేట మండలం అక్కినేపల్లి గ్రామంలో చేపడుతున్న నాన్-క్యాడస్ట్రల్ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియ, భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు విధానాలను అడిగి తెలుసుకుని పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం దమ్మపేట మండలం లింగంపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1458లో కొనసాగుతున్న ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. అటవీ మరియు రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించి, భూముల సరిహద్దుల నిర్ధారణలో ఖచ్చితత్వం పాటించాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరాలు అందిస్తూ అక్కినేపల్లి గ్రామ పరిధిలో సుమారు 4,400 ఎకరాల విస్తీర్ణంలో ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం పనులు ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయని తెలిపారు. మరో రెండు నెలల్లో సర్వే ప్రక్రియను పూర్తిచేయనున్నట్లు వివరించారు. దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను మ్యాప్ ద్వారా పరిశీలించి, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, సర్వే, సరిహద్దుల నిర్ధారణ అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టు పనులకు ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే ద్వారా అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారణ కావడంతో పాటు భవిష్యత్తులో తలెత్తే వివాదాలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే, భూసేకరణ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి మధు, దమ్మపేట తాసిల్దార్ రామ్ నరేష్, ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ రావు,సర్వేయర్ నాగరాజు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యున్నత వైద్యం అందించేలా చర్యలు

**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



( జూన్ - 20- హంస కలంవార్త )

జిల్లాలోని పేద ప్రజలందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.శనివారం ఆయన నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న ఓపీ సేవల నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సగటున నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు, ఏ విభాగాలకు చెందిన చికిత్సల కోసం ఎక్కువ మంది రోగులు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని సందర్శించి, రోగులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందించాలని, అవసరమైన వారికి తక్షణమే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు.రోగుల సౌకర్యార్థం వివిధ విభాగాలను సూచించే సైన్ బోర్డులను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన కలెక్టర్, ప్రతి రికార్డును పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ విభాగాన్ని పరిశీలించిన ఆయన, ఇంకా పూర్తి కావాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ తనిఖీలో ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శారద, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్

## ఇంగ్లండ్ పర్యటనకు పాండ్యా దూరం




'నేను రెడీ' అంటున్న కోహ్లీ..! భారత స్టార్ బ్యాటర్ హార్దిక్ పాండ్యా వరసగా మరో సిరీస్‌కు దూరం కానున్నాడు. ఐపీఎల్ 19వ సీజన్‌లో వెన్నునొప్పితో ఇబ్బంది పడిన పాండ్యా.. అఫ్గనిస్థాన్‌తో వన్డేలకు అందుబాటులో లేడు. త్వరలో ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు సైతం ఆ పేస్ ఆల్‌రౌండర్ అందుబాటులో ఉండడం లేదు. అందుకు కారణం 50 ఓవర్ల ఫార్మాట్‌కు అవసరమైన ఫిట్‌నెస్ సాధించకపోవడమేనని సమాచారం. టీమిండియాకు తీపికబురు ఏంటంటే.. విరాట్ కోహ్లీ ఇంగ్లండ్ సిరీస్‌లో ఆడే అవకాశాలున్నాయి. ఇంగ్లండ్ పర్యటనకు భారత జట్టు కీలక ఆటగాడైన హార్దిక్ పాండ్యా సేవల్ని కోల్పోనుంది. 19వ సీజన్ ఐపీఎల్‌లో వెన్ను నొప్పితో ఇబ్బందిపడిన పాండ్యా.. సీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకుంటున్నాడు. ఈమధ్యే ఫిట్‌నెస్, బౌలింగ్ పరీక్ష నిర్వహించగా అతడు నిర్దేశించిన ప్రమాణాలు అందుకోలేదు. బౌలింగ్ భారం పడుతున్నందున పాండ్యా కోలుకునేందుకు మరింత సమయం పట్టనుందని సీఓఏ చెబుతోంది. భారత స్టార్ బ్యాటర్ హార్దిక్ పాండ్యా వరసగా మరో సిరీస్‌కు దూరం కానున్నాడు. తీపికబురు ఏంటంటే.. విరాట్ కోహ్లీ ఇంగ్లండ్ సిరీస్‌లో ఆడే అవకాశాలున్నాయి. మరోవైపు.. ఐపీఎల్ 19వ సీజన్‌లో తొడ కండరాల గాయంతో బాధ పడిన విరాట్ కోహ్లీ వేగంగా కోలుకుంటున్నాడు. అఫ్గనిస్థాన్‌తో వన్డే సిరీస్‌కు దూరమైన రన్ మెషిన్ ఇంగ్లండ్ సిరీస్ లక్ష్యంగా సన్నద్ధమవుతున్నాడు. 'కుడి తొడ కండరాల గాయంతో ఇబ్బంది పడుతున్న విరాట్ కోహ్లీ వేగంగా కోలుకుంటున్నాడు. లండన్‌లో అతడిని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ బృందం పర్యవేక్షించింది. ప్రస్తుతం రిహాబిలిటేషన్‌లో ఉన్న కోహ్లీ.. ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే అవకాశాలు మెరుగవుతున్నాయి' అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో వన్డేల్లోనే కొనసాగుతున్న విరాట్ జూన్ 22న బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరనున్నాడు. అక్కడ రిహాబిలిటేషన్‌లో ఫిట్‌నెస్ చాటుకుంటే ఇంగ్లండ్ పర్యటనకు కోహ్లీ వెళ్లడం పక్కా. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ ఆడాలనుకుంటున్న కోహ్లీకి ఈ సిరీస్ కీలకం కానుంది. జూలై 14 నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్యమూడు వన్డేల సిరీస్ జరుగనుంది.

## రౌండ్-32 చేరిన తొలి జట్టుగా రికార్డు



1-0తో దక్షిణ కొరియాపై ఉత్కంఠ విజయం ఫిఫా ప్రపంచకప్ లో ఆతిథ్య మెక్సికో అదరగొట్టింది. గ్రూప్-ఎ లో వరుసగా రెండో విజయంతో మెగా టోర్నమెంట్‌లో నాకౌట్ (రౌండ్-32) దశకు అర్హత సాధించిన తొలి జట్టుగా నిలిచింది. ప్రేక్షకులతో కిక్కిరిసిన ఎస్టాడియో అక్రాన్ స్టేడియంలో శుక్రవారం హోరాహోరీగా జరిగిన గ్రూప్-ఎ పోరులో మెక్సికో 1-0 తేడాతో దక్షిణ కొరియాను ఓడించింది. ఆట మధ్యలో కొరియా డిఫెన్స్ యూనిట్ చేసిన ఘోర తప్పిదాన్ని అనుకూలంగా మార్చుకున్న మెక్సికో గోల్ కొట్టి ముందంజ వేసింది. గత ప్రపంచకప్‌లో గ్రూప్ దశలోనే నిష్క్రమించిన మెక్సికో.. ఈసారి స్వదేశంలో నాకౌట్ చేరి అభిమానులను సంబరాల్లో ముంచెత్తింది. ఈ గెలుపుతో మెక్సికో 6 పాయింట్లతో గ్రూప్-ఎ లో అగ్రస్థానంలో నిలిచింది. ఇదే గ్రూప్‌లో చెక్ రిపబ్లిక్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన మరో మ్యాచ్ 1-1తో డ్రాగా అయింది. కొరియా తప్పిదం.. రోమో మెరుపు గోల్ ఈ మ్యాచ్ ఫస్టాఫ్ ఎలాంటి గోల్స్ లేకుండా చప్పగా సాగింది. అయితే రెండో సగం ప్రారంభమైన కొద్దిసేపటికే ఆట మలుపు తిరిగింది. 50వ నిమిషంలో దక్షిణ కొరియా గోల్‌కీపర్ కిమ్ స్యుంగ్ జు, డిఫెండర్ లీ గియుక్ ఒకరినొకరు ఢీకొనడంతో బంతి చేజారింది. అక్కడే సిద్ధంగా ఉన్న మెక్సికో మిడ్‌ఫీల్డర్ లూయిస్ రోమో ఏమాత్రం ఆలస్యం చేయకుండా బాల్‌ను ఖాళీ గోల్ పోస్ట్‌లోకి పంపి జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. 75వ నిమిషంలో మెక్సికో రెండో గోల్ సాధించేందుకు చాలా చేరువగా వచ్చింది. ఆ జట్టు ఆటగాడు రావుల్ జిమెనెజ్ కొట్టిన షాట్‌ను కొరియా కీపర్ కిమ్ అడ్డుకున్నాడు. మరోవైపు స్కోరు సమం చేసేందుకు కొరియన్లు చాలా ప్రయత్నాలు చేశారు. ఆట చివర్లో దాడుల్లో వేగం పెంచారు. 87వ నిమిషంలో గోల్ చేసే సువర్ణావకాశాన్ని కోల్పోయింది. కొరియా ప్లేయర్ చో గుయ్-సంగ్ హెడర్ ద్వారా కొట్టిన క్లోజ్-రేంజ్ షాట్‌ను మెక్సికో గోల్‌కీపర్ రావుల్ రాంజెల్ అద్భుతంగా అడ్డుకున్నాడు. ఆ వెంటనే రీబౌండ్ అయిన బంతిని యాంగ్ హ్యున్-జున్ మళ్లీ గోల్ కొట్టేందుకు ప్రయత్నించగా, రాంజెల్ తన కుడి చేతిని చాచి బాల్ లైన్ దాటకుండా ఆపాడు. మరోవైపు దక్షిణ కొరియా భారీ అంచనాలు పెట్టుకున్న స్టార్ ఆటగాడు, లాస్ ఏంజిల్స్ ఎఫ్‌సీ ఫార్వర్డ్ సన్ హ్యుంగ్-మిన్ ఈ మ్యాచ్‌లోనూ నిరాశపరిచాడు. ప్రపంచకప్‌లో కొరియా తరపున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన 33 ఏండ్ల సన్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోవడంతో 57వ నిమిషంలోనే కోచ్ అతడిని వెనక్కి పిలిచాడు. లేట్ గోల్స్‌తో స్విస్ జోరు గ్రూప్-బి మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ 4-1తో బోస్నియా-హెర్జెగోవినాపై ఘనవిజయం సాధించింది. మ్యాచ్ 73వ నిమిషం వరకు ఇరు జట్లు 0-0తో సమంగా ఉన్నప్పటికీ, ఆఖరి 20 నిమిషాల్లో స్విస్ జట్టు వరుస గోల్స్‌తో విరుచుకుపడింది. సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన 20 ఏండ్ల యువ ప్లేయర్ జోహాన్ మంజంబి (74, 90వ నిమిషాల్లో) రెండు సూపర్ గోల్స్‌తో మెరిశాడు. రూబెన్ వర్గాస్ (84వ నిమిషం) ఓ గోల్ కొట్టగా.. ఇంజ్యూరి టైమ్‌లో లభించిన పెనాల్టీని కెప్టెన్ గ్రానిట్ జాకా (90+7వ నిమిషం) పెనాల్టీ) గోల్‌గా మలిచి జట్టుకు భారీ విజయం అందించాడు.

## ఫార్ములా వన్ అధ్యయనానికి టాస్క్ ఫోర్స్



2028లో ఇండియన్ గ్రాండ్ పిక్స్ సాధ్యమేనా..! భారత్‌లో మోటార్ స్పోర్ట్స్ వేగం పుంజుకోనుంది. ఫార్ములా వన్ రేసును ఆరంభించేందుకు క్రీడా మంత్రిత్వ శాఖ పావులు కదుపుతోంది. క్రీడా మంత్రి మన్సూఖ్ మాండవీయ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. త్వరలోనే ఫార్ములా వన్.. వంటి మోటార్ స్పోర్ట్స్ పోటీల నిర్వహణపై దృష్టి సారించాలని ఆదేశించారు. 2028లో భారత గడ్డపై మోటార్ గ్రాండ్ ప్రిక్స్ ఈవెంట్ జరపడమే లక్ష్యంగా టాస్క్ ఫోర్స్ సలహాలు, సూచనలు ఇవ్వనుంది. సాకర్‌తో పాటు మోటార్ స్పోర్ట్స్ వంటి ఆటల్ని ఇష్టపడే భారతీయులు చాలామందే. బుల్లెట్ వేగంతో రయ్‌రయ్‌మంటూ ట్రాక్ మీద కార్లు దూసుకెళ్లే ఫార్ములా వన్‌ను చూసేందుకు రెండు కళ్లు చాలవు. అందుకే.. ఈ ఆటను మనదేశంలోకి మళ్లీ తీసుకొచ్చేందుకు క్రీడల మంత్రి మన్సూఖ్ మాండవీయ ప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. భారతదేశంలో ప్రస్తుతం మోటార్ స్పోర్ట్స్ పరిస్థితి ఎలా ఉంది? అనేది తేల్చడం కోసం ప్రత్యేకంగా టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్‌లో ఈ ఆటను మరింత విస్తరించేందుకు అవసరమైన ఏర్పాట్లు, విధివిధానాల ఖరారు బాధ్యతల్ని ప్రత్యేక బృందానికి అప్పగించినట్టు మాండవీయ వెల్లడించారు.

# బిజినెస్

## 37,700 కోట్ల జియో ఐపీవో



దేశంలోనే అతిపెద్ద ఐపీవోగా రికార్డు! నిన్న ఎన్ఎస్ఈ రూ.30,000 కోట్లు.. నేడు జియో ప్లాట్‌ఫామ్స్ 37,700 కోట్లు. దేశీయ క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ వద్దకు బ్యాక్‌టుబ్యాక్ మెగా ఐపీవోలు క్యూ కట్టాయి. శుక్రవారం జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) కోసం సెబీకి డ్రాఫ్ట్ పేపర్లను దాఖలు చేసింది. దాదాపు రూ.37,700 కోట్ల (4 బిలియన్ డాలర్లు) నిధుల సమీకరణే లక్ష్యంగా ఇది వస్తున్నది. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే ఇదే అతిపెద్ద ఐపీవోగా నిలువబోతున్నది. ప్రస్తు తం హ్యుందాయ్ మోటర్ రూ.37,700 కోట్ల (4 బిలియన్ డాలర్లు) నిధుల సమీకరణే లక్ష్యంగా ఇది వస్తున్నది. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే ఇదే అతిపెద్ద ఐపీవోగా నిలువబోతున్నది. ప్రస్తుతం హ్యుందాయ్ మోటర్ రూ.27,870 కోట్ల ఐపీవోదే రికార్డు. జియో ఐపీవో వస్తే ఇది చెరిగిపోనున్నది. ఇక ఈ పబ్లిక్ ఇష్యూ సందర్భంగా 27 కోట్లదాకా ఫ్రెష్ షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఇది జియోలో 2.9 శాతం వాటాకు సమానం. జియోను దాదాపు 137 బిలియన్ డాలర్లుగా లెక్కించి ఈ ఐపీవోను తెస్తున్నారు. ఇక సమీకరించిన నిధుల్లో రూ.27,500 కోట్లను బకాయిలను చెల్లించడానికే వినియోగించనున్నారని సమాచారం. త్వరలోనే వారసులకు అప్పగిస్తా..రిలయన్స్ వ్యాపార సామ్రాజ్యాన్ని త్వరలోనే తన వారసులకు ఇస్తానని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సారథి ముకేశ్ అంబానీ ఏజీఎంలో లక్షలాది వాటాదారులకు స్పష్టం చేశారు. 'రిలయన్స్ వారసత్వం ప్రక్రియ దాదాపు తుది దశకు చేరుకున్నది. ప్రస్తుతం ఆకాశ్, ఇషా, అనంత్.. వారికి అప్పగించిన రోజువారీ వ్యాపార కార్యకలాపాలను చూసుకుంటున్నారు. ఈ కంపెనీ భవిష్యత్తు కేవలం సురక్షితమైన నాయకుల చేతుల్లోనేగాక.. సంస్థ పేరు, ప్రఖ్యాతులను ఆకాశమంత ఎత్తులో నిలబెట్టగల సమర్థుల చేతుల్లో ఉన్నదని నేను చెప్పగలను. పిల్లలు మూడేండ్లుగా రిలయన్స్ ఇండస్ట్రీస్ బోర్డులో భాగమయ్యారు. ఇషా కన్స్యూమర్ వ్యాపారాన్ని, ఆకాశ్ టెక్నాలజీ వ్యాపారాన్ని, అనంత్ ఎనర్జీ వ్యాపారానికి సారథ్యం వహిస్తున్నారు' అని ముకేశ్ అంబానీ అన్నారు. ఇదిలావుంటే వచ్చే నాలుగేండ్లలో తమ ఎఫ్ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (ఆర్‌సీపీఎల్) ఆదాయం రూ.లక్ష కోట్ల మార్కును తాకవచ్చని భావిస్తున్నామని, దేశీయ అతిపెద్ద ఎఫ్ఎంసీజీ కంపెనీల్లో ఒకటిగా, ప్రపంచ శ్రేణికి తగ్గట్టుగా ఎదుగడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా రిలయన్స్ రిటైల్ డైరెక్టర్ ఇషా అంబానీ చెప్పారు. రాబోయే మూడేండ్లలో ఆర్‌సీపీఎల్ అదనంగా రూ.30,000 కోట్ల పెట్టుబడులను పెట్టే యోచనలో ఉన్నట్టు తెలిపారు. ఇక జమ్‌నగర్ రిఫైనరీ ప్లాంట్‌ను ప్రపంచంలోనే తొలి పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తి కలిగిన రిఫైనరీగా నిలబెట్టాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ కృషి చేస్తున్నదని, గత ఆర్థిక సంవత్సరం తమ ఆయిల్-టు-కెమికల్ వ్యాపారం ఆదాయం 5.7 శాతం ఎగిసి రూ.6.62 లక్షల కోట్లుగా నమోదైందని, అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇక్కడ కార్యకలాపాలు సాగుతున్నాయని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ వివరించారు.

## 3 వేల వరకు మరింత తగ్గిన పుత్తడి



దిగిన తులం విలువ బంగారం ధరలు మరింత తగ్గాయి. వరుసగా నాలుగు రోజులుగా తగ్గుతూ వచ్చిన గోల్డ్ ధర శుక్రవారం రూ.1.5 లక్షల స్థాయికి పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేకపోవడంతోపాటు దేశీయంగా కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉండటంతో ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.2,840 తగ్గి రూ.1,50,600కి పడిపోయింది. మరింత తగ్గిన పుత్తడి.. రూ.3 వేల వరకు దిగిన తులం విలువ బంగారం ధరలు మరింత తగ్గాయి. వరుసగా నాలుగు రోజులుగా తగ్గుతూ వచ్చిన గోల్డ్ ధర శుక్రవారం రూ.1.5 లక్షల స్థాయికి పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేకపోవడంతోపాటు దేశీయంగా కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉండటంతో ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.2,840 తగ్గి రూ.1,50,600కి పడిపోయింది. అంతకుముందు ఇది రూ.1,53,440గా ఉన్నది. డాలర్‌కు డిమాండ్ పడిపోవడం కూడా ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. పసిడితోపాటు వెండి ధరలు రెండు నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉండటంతో కిలో వెండి ఏకంగా రూ.8,040 తగ్గి రూ.2,40,700కి పడిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్ 7న నమోదైన రూ.2.40 లక్షల స్థాయికి పడిపోయినట్టు అయింది. అమెరికా వడ్డీరేట్లు అధిక స్థాయిలో ఉండవచ్చన్న అంచనాలతో పెట్టుబడిదారులు డాలర్ వైపు మొగ్గుచూపడంతో బులియన్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.

## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు




యాక్సెంచర్ షాక్ 1.35 లక్షల కోట్లు ఆవిరి భారతీయ ఐటీ దిగ్గజ కంపెనీలు ఇవాళ అనూహ్యమైన షాక్‌కు గురయ్యాయి. సుమారు 1.35 లక్షల కోట్ల విలువైన స్టాక్స్ కుప్పకూలినట్లు తెలుస్తోంది. గ్లోబల్ ఐటీ కన్సల్టెన్సీ యాక్సెంచర్ కంపెనీ ఇచ్చిన రెవన్యూ రిపోర్టు.. భారతీయ ఐటీ కంపెనీలను తీవ్రంగా షేక్ చేసింది. శుక్రవారం ట్రేడింగ్‌లో ఐటీ కంపెనీల స్టాక్స్ దారుణంగా పడిపోయాయి. ఇన్ఫోసిస్ కంపెనీలో 8.5 శాతం ట్రేడింగ్ తగ్గిపోయింది. స్టాక్ ఎక్స్‌చేంజ్ ట్రేడింగ్‌లో ఇవాళ ఇన్ఫోసిస్ కంపెనీ షేర్లు 8.59 శాతం, టెక్ మహేంద్ర షేర్లు 7 శాతం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేర్లు 6.52, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 6 శాతం, విప్రో షేర్లు 4.29 శాతం పడిపోయాయి. యాక్సెంచర్ ఇచ్చిన ఆదాయ రిపోర్టు నేరుగా భారతీయ ఐటీ కంపెనీల స్టాక్స్‌పై ప్రభావం చూపింది. కృత్రిమ మేధ వల్ల వృద్ధి తగ్గనున్నట్లు ఇటీవల యాక్సెంచర్ కంపెనీ తన ఆదాయ రిపోర్టును అంచనా వేసింది. ఆ నివేదిక ఇప్పుడు భారతీయ ఐటీ కంపెనీల్లో వణుకు పుట్టించింది. శుక్రవారం స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ ఒక్కసారిగా కుదేలైంది. టెకీ ప్రాజెక్టుల కోసం ఎక్కువగా ఇండియన్ కంపెనీలన్నీ యాక్సెంచర్ సంస్థపైనే ఆధారపడడం వల్ల.. యాక్సెంచర్ ఇచ్చిన రిపోర్టు భారత ఐటీ కంపెనీలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది.

# నటి రుక్మిణి వసంత్ డీప్‌ఫేక్ కేసు



కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన ఏఐ జనరేటెడ్ ఫొటోలు, వీడియోలను సృష్టించి సోషల్ మీడియాలో షేర్ చేశారనే ఆరోపణలపై బెంగళూరు సైబర్ క్రైమ్ పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ ఉపయోగించి 'కాంతార: చాప్టర్ 1' నటి మార్ఫ్ చేసిన విజువల్స్ క్రియేట్ చేశారని, ఆమె పరువుకు భంగం కలిగించే ఉద్దేశంతో వాటిని ఆన్‌లైన్‌లో షేర్ చేశారని పోలీసు అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ సందర్భంగా మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న అధికారులు కేసుపై వివరమైన దర్యాప్తు ప్రారంభించారు. ఏఐ జనరేటెడ్ బికినీ ఫొటోలు వైరల్ అయిన తర్వాత నటి రుక్మిణి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వైరల్ అవుతున్న విజువల్స్ పూర్తిగా ఫేక్ అని, వాస్తవం కాదని స్పష్టం చేసిన ఆమె, టెక్నాలజీ దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అయితే ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు నిందితులను చాకచాక్యంగా పట్టుకున్నారు. ముగ్గురు నిందితుల అరెస్ట్ కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన ఏఐ జనరేటెడ్ ఫొటోలు, వీడియోలను సృష్టించి సోషల్ మీడియాలో షేర్ చేశారనే ఆరోపణలపై బెంగళూరు సైబర్ క్రైమ్ పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఇక తాజాగా నిందితులను జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, దర్యాప్తు కొనసాగుతున్నందున కస్టడీకి రిమాండ్ చేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మార్ఫ్ చేసిన కంటెంట్ క్రియేషన్, సర్క్యులేషన్‌లో మరికొందరు వ్యక్తులు ఉన్నారా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.

# 'మా ఇంటి బంగారం' ఫస్ట్ డే కలెక్షన్స్




సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' థియేటర్లలో సాలిడ్ ఓపెనింగ్ సాధించింది. ట్రేడ్ వర్గాల ప్రకారం ఈ చిత్రం తొలిరోజు భారతదేశంలో రూ.5.35 కోట్ల నెట్ వసూళ్లను రాబట్టినట్లు తెలుస్తుంది. దీంతో ఇండియా గ్రాస్ కలెక్షన్ సుమారు రూ.6.20 కోట్లుగా నమోదుకాగా. దేశవ్యాప్తంగా 2,658 షోలలో ఈ సినిమా ప్రదర్శితమైంది. ఓవర్సీస్ మార్కెట్ నుంచి మరో రూ.4.50 కోట్ల గ్రాస్ రావడంతో తొలిరోజు వరల్డ్‌వైడ్ గ్రాస్ కలెక్షన్ రూ.10.70 కోట్లకు చేరింది. రిజియన్ వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి రూ.4.75 కోట్ల గ్రాస్‌తో టాప్‌లో నిలిచాయి. కర్ణాటకలో రూ.90 లక్షలు, తమిళనాడులో రూ.38 లక్షల గ్రాస్ వసూళ్లు నమోదయ్యాయి. తెలుగు 2డి వెర్షన్‌కు ఆక్యుపెన్సీ రోజంతా పెరుగుతూ వచ్చింది. ఇక తాజాగా నిందితులను జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, దర్యాప్తు కొనసాగుతున్నందున తెలుగులో దుమ్మురేపిన ఓపెనింగ్! సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' థియేటర్లలో సాలిడ్ ఓపెనింగ్ సాధించింది. ఉదయం షోలకు 26.15 శాతం ఉన్న ఆక్యుపెన్సీ, రాత్రి షోలకు 51.38 శాతానికి చేరింది. ప్రీమియం తెలుగు ఫార్మాట్‌కు 96 శాతం ఓవరాల్ ఆక్యుపెన్సీ నమోదైంది. హైదరాబాద్‌లో దాదాపు హౌస్‌ఫుల్స్ పడగా, రాత్రి షోలకు 100 శాతం ఆక్యుపెన్సీ వచ్చింది. 'కుషి' 2023 తర్వాత సమంత తెలుగు సినిమాలో లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. నిజం చేస్తూ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, మంజుష, శ్రీముఖి కీలక పాత్రల్లో నటించారు.

# 'మిక్స్ అయ్యే కాలం వచ్చిందిలే



హీరో సూర్య నటిస్తున్న నయా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'విశ్వనాథ్ & సన్స్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14వ తేదీన విడుదల కానుంది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి తొలి గీతంగా 'నేనో బటర్‌ఫ్లై'ను తాజాగా చిత్ర బృందం విడుదల చేసింది. జి.వి. ప్రకాష్ ఈ గీతాన్ని స్వరపరిచారు. 'రఫ్ అయిన నువ్వు.. టఫ్ అయిన నేను.. మిక్స్ అయ్యే కాలం వచ్చిందిలే" అంటూ సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి రాసిన సాహిత్యం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గాయని సుబ్లాషిని తన మధురమైన గాత్రంతో ఈ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. కుటుంబ భావోద్వేగాలు, హృదయాన్ని హత్తుకునే అంశాలతో పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఈ సినిమాపై ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది అని చిత్ర బృందం తెలిపింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది.

# పెద్ద మనసు చాటుకున్న బండ్ల గణేశ్



అనారోగ్యంతో ఉన్న చిన్నారికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం! సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ మరోసారి తన పెద్ద మనసు చాటుకున్నారు. ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న హనుమకొండకు చెందిన చిన్నారి నిరంజన్ కుటుంబానికి తాను ప్రకటించిన రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని స్వయంగా అందజేశారు. హనుమకొండ హనుమాన్ నగర్‌లోని నిరంజన్ నివాసానికి వెళ్లిన బండ్ల గణేశ్, చిన్నారితో కాసేపు ముచ్చటించి ధైర్యం చెప్పారు. అనంతరం తల్లిదండ్రులు రాంగోపాల్ చారి, మానసలతో నిరంజన్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. తన పరమేశ్వర ఆర్ట్స్ ప్రొడక్షన్ బ్యానర్ తరపున రూ.5 లక్షల చెక్‌ను వారికి అందజేసి, భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండ్ల గణేశ్, "నేను పవన్ కల్యాణ్ గారి భక్తుడిని. దైవసమానులైన పవన్ కల్యాణ్ గారు ఈ బాబును పరామర్శించినప్పుడే నిరంజన్ గురించి నాకు తెలిసింది. ఆయన స్ఫూర్తితోనే నేను ఈ రోజు ఇక్కడికి వచ్చి ఆర్థిక సాయం చేశాను. మేమంతా ఈ స్థాయిలో ఉన్నామంటే దానికి పవన్ కల్యాణ్ గారి దయే కారణం" అని అన్నారు. ప్రస్తుతం తన కూతురి వివాహ పనులతో బిజీగా ఉన్నప్పటికీ ఈ రోజే వచ్చి సాయం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ రోజు రూ.5 లక్షల సాయాన్ని నిరంజన్ కుటుంబానికి అందించడం ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. బాబు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ పవిత్రమైన సందర్భంగా నేను ఎలాంటి రాజకీయాలు మాట్లాడదలుచుకోలేదు అని బండ్ల గణేశ్ స్పష్టం చేశారు.


# నాగబంధం-విజువల్ వండర్



'నాగబంధం ది సీక్రెట్ ట్రెజర్' సినిమాని దర్శకుడు అభిషేక్ నామా తెరకెక్కించారు. విరాట్ కర్ణ హీరోగా నటించారు. ఈ చిత్రం జూలై 3న ప్రేక్షకులకు ఓ గొప్ప థియేట్రికల్ అనుభూతిని అందిం చేందుకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్ విడుదలైంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ అభిషేక్ నామా మాట్లాడుతూ, 'జీవితంలో ఎన్నో కలలు, ఎన్నో ఆలోచనలు ఉంటాయి. కానీ ఒక గొప్ప విజన్‌ను ఆచరణలోకి తీసుకు రావాలంటే దాన్ని నమ్మే నిర్మాత అవసరం. మా నిర్మాత కిషోర్ కి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమా కోసం ఖర్చు చేసిన ప్రతి రూపాయి కూడా తెరపై కనిపి స్తుంది. ఆర్ట్ డైరెక్టర్ అశోక్, డీవోపీ సౌందర్ రాజన్, మా ఎడిటర్‌తో పాటు ప్రతి సాంకేతిక నిపుణుడు నా విజన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో ఎంతో కీలక పాత్ర పోషించారు. వారి సహకారం లేకుండా ఈ స్థాయి సినిమా సాధ్యమయ్యేది కాదు. జూలై 3న మీ అందరికీ ఒక అద్భుతమైన సినిమాను అందిస్తున్నామనే నమ్మకం ఉంది. ఈ సినిమా కోసం మొత్తం పని తెలుగు రాష్ట్రాల్లోనే జరిగింది. ఇందులో కనిపించే విజువల్ ఎఫెక్ట్స్ కూడా మన తెలుగు టెక్నీషియన్స్ రూపొందించినవే కావడం నాకు మరింత గర్వంగా ఉంది. విజువల్‌గా, సాంకేతికంగా ఈ సినిమా ప్రేక్షకులకు ఒక గ్రాండ్ థియేట్రికల్ అనుభూతిని అంది స్తుందిఅని తెలిపారు. 'ఈ సినిమాకు మీరందరూ చూపి స్తున్న ప్రేమ, సపోర్ట్, ఎగ్జైట్‌మెంట్ చూసి చాలా ఆనందంగా ఉంది. సినిమా అనేది ఒక కల. ఆ కలను నిజం చేయడానికి నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ ఎంతో కష్టపడ్డారు. మా దర్శకుడు అభిషేక్ విజన్ ఎంత గొప్పదో ట్రైలర్‌లోనే చూశారు. ఒక నిర్మాత, డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్న వ్యక్తి సినిమా తీస్తే ఎలా ఉంటుందో ఈ చిత్రంతో తెలుస్తుంది. మన పురాతన ఆలయాలు, వాటి వెనుక ఉన్న రహస్యాలు, చరిత్రను నెక్ట్స జనరేషన్‌కు తెలియజేసేలా ఈ సినిమా ఉంటుంది. నిర్మాత కిషోర్ ఎంతో ఓర్పుతో, నమ్మకంతో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. అలాగే రథయాత్ర ద్వారా వినూత్నంగా ప్రమోషన్స్ చేస్తున్నారు. ఒక అద్భుతమైన సినిమాను అందిస్తున్నామనే నమ్మకం ఉంది. ఈ సినిమా కోసం మొత్తం పని తెలుగు రాష్ట్రాల్లోనే జరిగింది. ఇందులో కనిపించే విజువల్ ఎఫెక్ట్స్ కూడా మన తెలుగు టెక్నీషియన్స్ రూపొందించినవే కావడం నాకు మరింత గర్వంగా ఉంది. విజువల్‌గా, సాంకేతికంగా ఈ సినిమా ప్రేక్షకులకు ఒక గ్రాండ్ థియేట్రికల్ అనుభూతిని అంది స్తుందిఅని తెలిపారు. 'ఈ సినిమాకు మీరందరూ చూపి స్తున్న ప్రేమ, సపోర్ట్, ఎగ్జైట్‌మెంట్ చూసి చాలా ఆనందంగా ఉంది. సినిమా అనేది ఒక కల. ఆ కలను నిజం చేయడానికి నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ ఎంతో కష్టపడ్డారు. మా దర్శకుడు అభిషేక్ విజన్ ఎంత గొప్పదో ట్రైలర్‌లోనే చూశారు. ఒక నిర్మాత, డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్న వ్యక్తి సినిమా తీస్తే ఎలా ఉంటుందో ఈ చిత్రంతో తెలుస్తుంది. మన పురాతన ఆలయాలు, వాటి వెనుక ఉన్న రహస్యాలు, చరిత్రను నెక్ట్స జనరేషన్‌కు తెలియజేసేలా ఈ సినిమా ఉంటుంది. నిర్మాత కిషోర్ ఎంతో ఓర్పుతో, నమ్మకంతో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. అలాగే రథయాత్ర ద్వారా వినూత్నంగా ప్రమోషన్స్ చేస్తున్నారు. ఆ రథయాత్రకు అద్భుతమైన స్పందన వచ్చింది అని హీరో విరాట్ కర్ణ చెప్పారు. నిర్మాత కిషోర్ అన్నపురెడ్డి మాట్లాడుతూ,"నాగబంధం'తో ఒక గొప్ప సినిమాను రూపొందించాందిఅని తెలిపారు. 'ట్రైలర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా మన నాగరికత వారస త్వాన్ని ప్రతిబిం బించే ప్రయత్నం అని నేను భావిస్తున్నాను. ఈ సినిమా మిమ్మల్ని అలరిస్తుంది అని నిర్మాత నిశిత నాగిరెడ్డి చెప్పారు.ఒక అద్భుతమైన సినిమాను అందిస్తున్నామనే నమ్మకం ఉంది. ఈ సినిమా కోసం మొత్తం పని తెలుగు రాష్ట్రాల్లోనే జరిగింది. ఇందులో కనిపించే విజువల్ ఎఫెక్ట్స్ కూడా మన తెలుగు టెక్నీషియన్స్ రూపొందించినవే కావడం నాకు మరింత గర్వంగా ఉంది. విజువల్‌గా, సాంకేతికంగా ఈ సినిమా ప్రేక్షకులకు ఒక గ్రాండ్ థియేట్రికల్ అనుభూతిని అంది స్తుందిఅని తెలిపారు. 'ఈ సినిమాకు మీరందరూ చూపి స్తున్న ప్రేమ, సపోర్ట్, ఎగ్జైట్‌మెంట్ చూసి చాలా ఆనందంగా ఉంది. సినిమా అనేది ఒక కల. ఆ కలను నిజం చేయడానికి నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ ఎంతో కష్టపడ్డారు. మా దర్శకుడు అభిషేక్ విజన్ ఎంత గొప్పదో ట్రైలర్‌లోనే చూశారు. ఒక నిర్మాత, డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్న వ్యక్తి సినిమా తీస్తే ఎలా ఉంటుందో ఈ చిత్రంతో తెలుస్తుంది. మన పురాతన ఆలయాలు, వాటి వెనుక ఉన్న రహస్యాలు, చరిత్రను నెక్ట్స జనరేషన్‌కు తెలియజేసేలా ఈ సినిమా ఉంటుంది. నిర్మాత కిషోర్ ఎంతో ఓర్పుతో, నమ్మకంతో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. అలాగే రథయాత్ర ద్వారా వినూత్నంగా ప్రమోషన్స్ చేస్తున్నారు. ఆ రథయాత్రకు అద్భుతమైన స్పందన వచ్చింది అని హీరో విరాట్ కర్ణ చెప్పారు. నిర్మాత కిషోర్ అన్నపురెడ్డి మాట్లాడుతూ,"నాగబంధం'తో ఒక గొప్ప సినిమాను రూపొందించాందిఅని తెలిపారు. 'ట్రైలర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా మన నాగరికత వారస త్వాన్ని ప్రతిబిం బించే ప్రయత్నం అని నేను భావిస్తున్నాను. ఈ సినిమా మిమ్మల్ని అలరిస్తుంది అని నిర్మాత నిశిత నాగిరెడ్డి చెప్పారు.ఆ రథయాత్రకు అద్భుతమైన స్పందన వచ్చింది అని హీరో విరాట్ కర్ణ చెప్పారు. నిర్మాత కిషోర్ అన్నపురెడ్డి మాట్లాడుతూ,"నాగబంధం'తో ఒక గొప్ప సినిమాను రూపొందించాందిఅని తెలిపారు. 'ట్రైలర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది.

# నాని 'ది ప్యారడైజ్'

నుంచి రాఘవ్ జూయల్ ఫస్ట్ లుక్.. స్టార్ నటుడు నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. బాలీవుడ్ నటుడు రాఘవ్ జూయల్ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఆయన పుట్టినరోజు సందర్భంగా జూన్ చిత్ర బృందం 'విక్రమ్ మాలిక్' క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ గ్లింప్స్‌లో రాఘవ్ జూయల్ పవర్‌ఫుల్ అండ్ అథారిటేటివ్ 'విక్రమ్ మాలిక్' పాత్రలో కనిపించారు. నిప్పులు, వాన, గందరగోళం మధ్య మెడలో భారీ గోల్డ్ చెయిన్స్‌తో కారుపై నుంచి దూకుతూ రగ్గడ్ అండ్ డేంజరస్ లుక్‌లో అదరగొట్టారు. "ఖాన్దాన్ కా షాన్, దోస్తోన్ కా జాన్.. విక్రమ్ మాలిక్ కి స్వాగతం సుస్వాగతం.. షెహర్ మేరా, నామ్ మేరా.. వెల్‌కమ్ టు జడల్ జమానా" అనే డైలాగ్ విక్రమ్ మాలిక్ పవర్‌ను చూపిస్తోంది. గ్లింప్స్ చివర్లో నాని ధగడ్ పాత్రలో, రాఘవ్ జూయల్ మధ్య వచ్చే ఫేస్ ఆఫ్ సీన్ థియేటర్లలో పూనకాలు తెప్పించేలా ఉంది. అనిరుధ్ రవిచందర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ క్యారెక్టర్ ఎలివేషన్‌ను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లింది.విక్రమ్ మాలిక్‌గా అదిరే ఎంట్రీ స్టార్ నటుడు నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. 'దసరా' లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో వస్తున్న రెండో చిత్రమిది. మాలిక్ పవర్‌ను చూపిస్తోంది. గ్లింప్స్ చివర్లో నాని ధగడ్ పాత్రలో, రాఘవ్ జూయల్ మధ్య వచ్చే ఫేస్ ఆఫ్ సీన్ థియేటర్లలో పూనకాలు తెప్పించేలా ఉంది. అనిరుధ్ రవిచందర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ క్యారెక్టర్ ఎలివేషన్‌ను నెక్ట్స్ లెవెల్‌కు సికింద్రాబాద్‌లోని ఒక స్లమ్ నేపథ్యంలో పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. అనిరుధ్ రవిచందర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ క్యారెక్టర్ ఎలివేషన్‌నుఈ చిత్రంలో నాని, మోహన్ బాబు షికంజా మాలిక్ పాత్రలో, రాఘవ్ జూయల్, కాయాడు లోహర్ హీరోయిన్‌గా, సోనాలి కుల్కర్ణి, సంపూర్ణేష్ బాబు బిర్యానీ పాత్రలో నటిస్తున్నారు.




Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449